విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 03 డిసెంబరు 2025 8 పేజీలు

ఇంటింటికి సీపీఐ శతాబ్ది చరిత్ర

ఏలూరు జిల్లా కార్యదర్శి
మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం: వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ఇంటింటికి తెలియజేయాలని ఇందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించుకొని ముందుకు వెళ్లాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సీపీఐ జంగారెడ్డిగూడెం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం కుంచె వసంతరావు అధ్యక్షతన సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో లక్షలాదిమందితో బహిరంగ సభ జరుగుతుందని, దానికి ముందే కమ్యూనిస్టుపార్టీ చరిత్రను నేటి తరాలకు తెలియజేసే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా పార్టీ ఉద్యమ చరిత్రను అమరులైన వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో జనగణనతో పాటు కులగణన జరిగితేనే సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో కార్మికులు, శ్రామికులు కర్షకులకు రాజ్యాధికారం దక్కాలని భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు, ఉద్యమాలు చేపట్టిందని తెలిపారు. కార్మికులు, కర్షకులను పేదలను చైతన్య పరిచి అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిన చరిత్ర పార్టీకి ఉందని ఆయన అన్నారు. ఆ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరిన్ని ఉద్యమాలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆయన అన్నారు. ఎంతోమంది త్యాగాలతో సాధించిన దేశ స్వాతంత్ర్య ఫలాలను అణగారిన వర్గాలకు అందకుండా పథకం ప్రకారం దేశ సంపదను ఆదాని, అంబానీ లాంటి బడా బాబులకు అప్పగిస్తున్నారని ▶మిగతా 2లో..

కాకినాడ కార్పొరేషన్

ఆదాయం పెంపుపై చర్యలు

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు వెంటనే చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి షణ్మోహన్ సగిలి తెలిపారు. శారదమ్మ గుడి సమీపంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణతో కలిసి వివిధ విభాగాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లతో పోలిస్తే కాకినాడలో ఆదాయం తక్కువగా ఉండటం ఆందోళన కలిగించిందని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా కుళాయిల పన్ను బకాయిలు అధికంగా ఉండటంతో డిసెంబర్ 10 వరకు చెల్లింపులకు గడువు ఇవ్వగా, 11వ తేదీ నుండి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ రుసుముల్లో స్వల్ప పెంపు ప్రతిపాదనను అమలు చేయాలని ▶మిగతా 2లో..

విమాన సర్వీసుల అభివృద్ధిపై దృష్టి సారించండి

విమానయానశాఖ మంత్రిని కోరిన ఎంపీ హరీష్ బాలయోగి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్రంలో విమాన సర్వీసుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడును

అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి కోరారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో ఆయనను హరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయవాడ, రాజమండ్రి విమానాశ్రయాలలో విమాన రాకపోకలు, ఎక్కువ మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన విమానాలు, విపరీతంగా పెరిగిన టికెట్ ధరల కారణంగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను మంత్రితో చర్చించినట్లు చెప్పారు. మన రాష్ట్రాన్ని వారణాసి, సూరత్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు ప్రత్యేక సర్వీసుల ఆవశ్యకతను ▶మిగతా 2లో..

రైతుల గుండెల్లో దిత్వా

- గాలి, వానతో అల్లకల్లోలం
- కలవరపడుతున్న రైతన్న

విశాలాంధ్ర- ఉండి : దిత్వా తుఫాన్ రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నది. గత మూడు రోజులుగా రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చేతి దాక వచ్చిన పంట చేతిలోకి వస్తుందో లేదో అని రైతులు ఆవేదన,ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న గాలి,వాన చిరుజల్లులు, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తుఫాన్ నేపథ్యంలో పంటను వబ్బిడి చేసుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. వరి కోత యంత్రాలు, ట్రాక్టరు, ట్రక్కులు, బరకాలు, గోనె సంచులు సమకూర్చుకునేందుకు రైతులు పరిగెడుతున్నారు.

ఇదే అదునుగా భావించిన వరి కోత యంత్రాలు, ట్రాక్టరు ట్రక్కులు, రేట్లును అమాంతంగా పెంచి రైతుల నడ్డి విరుస్తున్నారు. ప్రతికూల వాతావరణం ఉండటంతో రైతులు దళారులు చెప్పిన రేటును సమర్పించుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరి కోత యంత్రానికి రూ. 3000 నుండి రూ. 3200 ఉండగా నేడు గంటకి రూ.3500 తీసుకోవటం రైతులకు గోరుచుట్టుపై రోకలి పోటుగా పరిణమించింది. మరోవైపు చేలల్లో నుండి ధాన్యాన్ని ట్రాక్టర్ మీద రోడ్డు మీదకు తీసుకువచ్చి రాశులుగా వేయటానికి అదనంగా ఖర్చు అవ్వటమే కాకుండా బరకాలకు సైతం రోజులు తరబడి అద్దె చెల్లించుకోవలసి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికే మోతా తుఫాను ఎకరాకు 10 నుండి 12 బస్తాలు దిగుబడి తగ్గించిందని దానిని మర్చిపోకముందే దిత్వా తుఫాన్ గోరు చుట్టుపై లోకల్ పోటుగా వచ్చిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతు దీనస్థితిని అర్థం చేసుకొని ధాన్యాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని దళారీ వ్యవస్థ నిర్మూలించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రాణం తీసిన సహజీవనం

టిడ్కో బిల్డింగ్ పైనుంచి యువతిని తోసేశాడు

విశాలాంధ్ర - పాలకొల్లు: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం

పెంకిళ్లపాడు టిడ్కో గృహాల సముదాయంలో సి65 బ్లాక్ 4వ అంతస్తు పైనుండి తాడి రాధ అనే మహిళను క్రిందికి నెట్టివేయడంతో సదరు మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. తాడి రాధ తన భర్త నుండి విడిపోయి సుమారు పది సంవత్సరాలు అవుతుందని స్థానికులు తెలిపారు. తాడి సుధాకర్ అనే వ్యక్తితో ఏడు సంవత్సరాలుగా సహజీవనం చేస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇరువురు మధ్య గొడవ జరగడంతో ఆమెతో సహజీవనం చేస్తున్న సుధాకర్ పైనుండి త్రోసివేసినట్లు తెలుస్తోంది. పాలకొల్లు పట్టణ పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసును దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి సంఘటన స్థలాన్ని పరిశీలించి వేగవంతమైన దర్యాప్తు చేస్తామన్నారు.

అందుబాటులో బరకాలు

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో దిత్వా తుఫాను వల్ల కురుస్తున్న వర్షాల మూలంగా రైతులు తమ ధాన్యం తడిచిపోకుండా భద్రపరుచుకోడానికి గ్రామాల్లో బరకాలను అద్దెకిచ్చేవారిని గుర్తించి వారినుంచి బరకాలను అద్దె ప్రాతిపదికన సేకరించి సహకార సంఘాల్లో

రైతు సేవా కేంద్రాల్లోరైతులకు అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ధాన్యం సేకరణ కేంద్రాలు, సహకార సంఘాలలో 11,000 బరకాలను ఉంచగా రైతులు 2,750 బరకాలను ఉపయోగించుకొన్నారని వివరించారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు తమ దగ్గరలోని సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల నుంచి బరకాలను తీసుకుని ధాన్యం తడవకుండా భద్రపరుచుకోవాలని కోరారు. ధాన్యం అమ్మినవెంటనే, తదుపరి అవసరమున్న రైతులు ఉపయోగించుకోవడానికి బరకాలను తిరిగి వెనక్కి ఇవ్వాలని బరకాలకు ఎటువంటి చార్జి చెల్లించవలసిన అవసరం లేదని జెసి పేర్కొన్నారు.

"రైతన్న మీ కోసం"కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర - నల్లజర్ల : డిసెంబర్ 3న నల్లజర్లలో నిర్వహించనున్న "రైతన్న మీ కోసం" కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారని జిల్లా

కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం నల్లజర్ల సభ ప్రాంగణంలో ఉదయం నుండి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, శాసన సభ్యులు మద్దిపాటి వెంకటరాజు, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవ కుమార్ తదితరులు క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేపట్టిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన సూచనలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. "రైతన్న మీ కోసం" ▶మిగతా 2లో..

సోలార్ ఎనర్జీ మరింతగా పెరగాలి

విశాలాంధ్ర -భీమవరం: సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సోలార్ ఎనర్జీ ఉత్పాదన మరింతగా పెరగాల్సి ఉందని పలువురు నిపుణులు పేర్కొన్నారు.

ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోలార్ పివి డ్రైవింగ్ ఇండియాస్ రెన్యూబెల్ ఎనర్జీ మిషన్ త్రో ఇన్నోవేషన్ ఇంటిగ్రేషన్ అండ్ ఆపర్చ్యునిటీస్ అనే అంశంపై రెండు రోజులు పాటు జరిగే జాతీయస్థాయి వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటి చెన్నై ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెన్యూబుల్ ఎనర్జీని అభివృద్ధి చేయడంతో పాటు దానిని స్టోర్ చేయటం తిరిగి వినియోగించటం వంటి అంశాలపై కూడా పూర్తి అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వికసిత్ భారత లక్ష్యాలలో భాగంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశం తయారు కావాలని అందులో భాగంగా 2030 నాటికి దేశంలో 50 శాతం రెన్యువల్ ఎనర్జీ వినియోగంలోకి రావాలని ఆ దిశగా పరిశోధనలు సాగుతున్నాయని వెల్లడించారు. వర్క్‌షాప్ కన్వీనర్ జి.హరీష్ కుమార్ వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈఈఈ విభాగం హెడ్ డాక్టర్ బి.ఆర్.కె వర్మ, ఐఈఐ భీమవరం చాప్టర్ సెక్రెటరీ డాక్టర్ ఎస్.రాజేష్ డాక్టర్ హరీష్ కుమార్ వర్మ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో భాగంగా మంగళవారం అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఉపాధ్యాయ క్రికెట్ పురుషుల జట్టు ఎంపిక నిర్వహించినట్లు నూజివీడు ఎంఈఓ దేవవర ప్రసాద్ తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రముఖ ఉపాధ్యాయుడు బొద్దుకోళ్ల బాబురావు సొంత ఖర్చుతో అందించిన మెడల్స్‌ను ఎంఈఓ దేవ వర ప్రసాద్, ప్రధాన ఉపాధ్యాయుడు రాఘవేంద్ర ప్రసాద్ అందజేశారు. జట్టుకు ఎంపికైన ఉపాధ్యాయులు రాఘవేంద్రరావు కెప్టెన్‌గా, సాకా రవి, ఎం ఎన్ వి ప్రసాద్, జే రంగారావు, రామకృష్ణ, మురళి, శ్రీధర్, టి.యువరాజ్, నాగేంద్రరావు రఘుబాబు, అవిబుల్లా, గోపి, ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, సతీష్, ఈశ్వర్ ప్రసాదు జట్టు సభ్యులుగాను ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు. ఎంపికైన జట్టు డివిజన్ స్థాయిలో ఆడనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్ర, లక్ష్మి, సుకుమార్, సతీష్, నాగేశ్వరరావు, రాణి, మీనా కుమారి, మంజుల వాణి, ఆరతి, రాజేంద్రప్రసాద్, అలీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సమన్వయ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరులో వైసీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు పాల్గొని పార్టీకి సంబంధించిన అంశాలపై చర్చించి నాయకులకు సూచనలు చేశారు. ఈసమావేశంలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు చిలుకూరి జ్ఞానారెడ్డి, సొంగ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, నిర్మాణానికి దరఖాస్తులు చేసుకోవాలి

విశాలాంధ్ర -ముదినేపల్లి : ఇప్పటివరకు ఎన్నడు ప్రభుత్వం నుండి స్థలాలు పొందని వారు ఇంటి నిర్మాణ రుణం పొందని వారు స్థలాలు ఇంటి నిర్మాణం కోసం ఈ నెల 14వ తేదీలోపు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు దరఖాస్తులు చేసుకోవాలని నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు భార్యాభర్త ఆధార్ , బ్యాంక్ అకౌంట్ , ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ కార్డ్ , కుల , ఆదాయ , ఇంటి పట్టా , రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలను బ్యాంక్ లింక్ అయి ఉన్న ఫోన్ నెంబర్ , పాస్ పోర్ట్స్ సైజ్ ఫోటో లతో సచివాలయంలో సంప్రదించాలన్నారు

పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: డిసెంబర్ 5న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహణపై కలెక్టర్ జిల్లా, డివిజనల్, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పండుగ వాతావరణంలో నిర్వహించే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం చారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులను సాదరంగా ఆహ్వానించాలన్నారు. ఈ టీచర్స్, పేరెంట్స్ సమావేశానికి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల ఉపాధ్యాయులతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న విషయం తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు, విద్యార్థినీ విద్యార్థులకు తాగునీరు, భోజన సదుపాయాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేరెంట్స్, టీచర్స్ మీట్ కు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.నారాయణ, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, డివిజన్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు (1వ పేజీ తరువాయి)

సమావేశం అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న రైతన్న మీకోసం కార్యక్రమం విజయవంతం కావడానికి చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. పెద్ద ఎత్తున రైతులు పాల్గొనే నేపథ్యంలో అందుకు తగిన విధంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామన్నారు . సీఎం పర్యటన దృష్ట్యా ప్రోటోకాల్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, హెలిప్యాడ్, స్టాల్స్, రైతుల ముఖాముఖి కార్యక్రమం వంటి అన్ని అంశాలపై సమగ్ర ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రముఖులతో పరిచయ కార్యక్రమం, వివిధ ప్రభుత్వ శాఖలు మరియు కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, ప్రజా వేదిక ద్వారా రైతులతో ముఖాముఖి, తదితర కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ , ఏలూరు రేంజ్ ఐజీ జి వి కే అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ ఇతర అనుబంధ శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ ట్రయిల్ రన్ నిర్వహించారు.

దృష్టి సారించండి (1వ పేజీ తరువాయి)

వివరించారు. తిరుపతి వంటి క్షేత్రానికి పెరుగుతున్న రద్దీ దృష్ట్యా విమాన సర్వీసులు డిమాండ్ కూడా పెరుగుతుందన్నారు. రానున్న పుష్కరాలకు రాజమండ్రి విమానాశ్రయానికి కూడా డిమాండ్ ఉంటుందని తెలిపారు. అందుకు అనుగుణంగా సర్వీసుల ఏర్పాటుకు కృషి చేయాలని హరీష్ మంత్రిని కోరారు.

పెంపుపై చర్యలు (1వ పేజీ తరువాయి)

సూచించారు. పార్కులు, ఉద్యానవనాలు, ఎన్టీఆర్ బీచ్ అభివృద్ధిపై కూడా సమావేశంలో చర్చించారు. ఫుడ్ కోర్టులు, ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, నెట్ క్రికెట్, గో కార్టింగ్ ట్రాక్‌లు, ఎమ్యూజ్‌మెంట్ రైడ్లు వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు వినోదం-కార్పొరేషన్‌కు ఆదాయం రెండూ పెరుగుతాయి అని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంక్రాంతి సందర్భంగా జనవరిలో కాకినాడ నగరంలో బోట్ల పోటీల నిర్వహణ ప్రతిపాదనను కూడా పరిశీలించారు. పార్కులను ప్రైవేటీకరణ చేయడం లేదని, టెండర్ విధానంలో అభివృద్ధికి ముందుకు వచ్చే సంస్థలకు మాత్రమే నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని కలెక్టర్ షణ్మోహన్ సగిలి స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాస్, ఎస్ఇ పి వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డిసిపి కృష్ణారావు, అకౌంటెంట్ రామశాస్త్రి, టిపిఆర్ఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది చరిత్ర (1వ పేజీ తరువాయి)

తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాలను ప్రైవేటు పరం చేసే కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని అధికారం ఉన్నప్పుడు ఒక మాట అధికారంలో లేనప్పుడు మరో మాట మాట్లాడే తత్వం ఆయనకు అలవాటైంద న్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో కమ్యూనిస్టు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కంకణం కట్టుకొని పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, సీపీఐ జంగారెడ్డిగూడెం మండల సమితి కార్యదర్శి జంపన వెంకట రమణ రాజు, జిల్లా సమితి సభ్యులు పి.బాలకృష్ణ,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూరాకుల బాబురావు, బి.అప్పలరాజు, చందా త్రిమూర్తులు, తాళ్లూరి నాగరాజు, కలపాల శ్రీరాములు,జగన్నాధ హనుమంతు,తదితరులు పాల్గొన్నారు.

9న సీపీఐ జనరల్ బాడీ సమావేశం

ఈ నెల 9వ తేదీన సీపీఐ జంగారెడ్డిగూడెం మండల జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకట రమణరాజు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరవుతారని, సభ్యులు మండల కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మిక సంఘాల దీక్షలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు ఆర్టీసీ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతితో ఎటు వంటి సంబంధం లేని ముగ్గురు ఉద్యోగస్తుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఏలూరు ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్ష శిబిరం మంగళవారం నాడు తొమ్మిదో రోజుకు చేరింది. తొమ్మిదో రోజు దీక్షలో జే ఏ ఎమ్ రావు, ఓ. చిరంజీవి, పివి రమణ, వి.సూరన్న, సిహెచ్ ఎస్ఎస్ నారాయణ, బిఎస్ చలం, కేపీ రావు, పి వి వి వి ఆర్ కుమార్ కూర్చున్నారు. తొమ్మిదో రోజు దీక్షలను జేఏసీ నాయకులు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు డిపో గౌరవ అధ్యక్షులు వై. శ్రీనివాస్ ప్రారంభించారు.

అంగన్వాడీ పిల్లలకు ఉత్సాహమైన బోధన చేయాలి

విశాలాంధ్ర-లింగపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఉత్సాహంతో కూడిన విద్యను అందించాలని ఐసిడిఎస్ పిడి శారద తెలి పారు. లింగ పాలెం మండలంలోని అంగన్వాడీ కేంద్రా లను చింతలపూడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవతితో కలిసి తనిఖీలు చేశారు.అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం నిర్దేశించిన పథకాలు సక్రమంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.కేంద్రాలకు వచ్చే పిల్లలు వారి వయసును బట్టి ఆరోగ్యంగా ఉండాలని ఎప్పటికప్పుడు బరువు, ఎత్తులను పరిశీలించాలని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు అందించే పోషక ఆహారాన్ని సక్రమంగా ఇవ్వాలని అన్నారు. అంగన్వాడీ సిబ్బంది వారికి అప్పగించిన పనులను సక్రమంగా సకాలంలో అమలు చేయాలని అన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు.అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వీరితోపాటు సూపర్వైజర్లు కుమారి, రామలక్ష్మి ఉన్నారు.

కొనిశెట్టి గణేష్ సౌజన్యంతో స్కూల్ ఆవరణలో గ్రావెల్‌తో పూడిక

విశాలాంధ్ర – గణపవరం: గణపవరం గ్రామం వెలమపేట ఆరో వార్డు ప్రభుత్వ ఎంపీపీ స్కూల్ ఆవరణలో వర్షం కురిస్తే మోకాళ్ళ లోతు నీళ్లు నిలవ ఉండడంతో ఆ నీటిలోనే విద్యార్థులు, ఉపాధ్యాయులు నడిచి వెళ్లి స్కూలు నిర్వహించేవారని ప్రధానోపాధ్యాయులు జాలీం నాని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు నాని గణపవరం గ్రామానికి చెందిన అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసి ప్రస్తుతం గణపవరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాత కొనిశెట్టి గణేష్‌ను సంప్రదించి విషయం ఆయనకు చెప్పడంతో ఆయన స్పందించి సుమారు 30 వేల రూపాయలు ఖర్చుతో ఆ పాఠశాల ఆవరణలో గ్రావెల్‌ను వేయించారు. దీంతో సమస్య పరిష్కారం జరిగిందని హెచ్ఎం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు గణేష్‌ను అభినందించారు.

అనాకోడేరులో రోడ్డు భద్రతపై ప్రచారం

విశాలాంధ్ర -భీమవరం: డి.ఎన్.ఆర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో మంగళవారం అనాకోడేరు గ్రామంలో రోడ్డు భద్రత, హెల్మెట్ ఉపయోగాలపై వాలంటీర్లు ప్రచారం చేసి వాహనదారులకు అవగాహన కల్పించారు. జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.అనిల్ దేవ్, రాజేష్, అధ్యాపకులు కె.సోమయ్య, జి.రంగారావు, యు.శ్రావ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెన్షన్‌తో పేదల జీవితాల్లో వెలుగులు

విశాలాంధ్ర -ఉండి: అర్హులైన పేదలకు ఎన్టీఆర్ పెన్షన్ ప్రతి నెల ఒకటి, రెండు తేదీల్లో అందిస్తూ పేదల జీవితంలో వెలుగు నింపుతున్న చంద్రన్న పేదల పెద్ద కొడుకని గ్రామ సర్పంచ్ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, కార్యదర్శి జేబిటి నాయుడు అన్నారు. మండల పరిధిలోని మహాదేవపట్నం గ్రామంలో వృద్ధులకు, వితంతులకు, వికలాంగులకు, సర్పంచ్ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, కార్యదర్శి జేవికి నాయుడు ఇంటింటికి తిరిగి మంగళవారం పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బలక్ష్మి, జేవిటి నాయుడు మాట్లాడుతూ లబ్ధిదారులకు పెన్షన్ పెద్ద ఆసరాగా పనిచేస్తుందన్నారు. పెన్షన్ అందరూ జీవితాల్లోనూ వెలుగులు నింపుతుందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి.నరసాపురం: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన గంగిరెడ్ల అప్పలరాజు గత 8సంవత్సరాల నుండి టి నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం వుంటున్నారు. అప్పలరాజు భవాని మాల వేసుకొని నవంబర్ 27వ తేదీన రాత్రి 7గంటలకు అదే వీధిలో వున్న పీఠం వద్దకు వెళ్ళగా భార్య హిమజ ఇద్దరు పిల్లలు ఇంటి వద్దనే వున్నారు. అప్పలరాజు పీఠం వద్ద పూజ ముగించుకుని రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చి చూడగా భార్య, పిల్లలు కనిపించలేదు. చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు బంధువుల ఇళ్ళ వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. అదే గ్రామానికి చెందిన శానంపూడి కుమార్ మీద అనుమానం వున్నట్లు హిమజ భర్త అప్పలరాజు ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దాతల సహాయంతో ఆలయాలు అభివృద్ధి

విశాలాంధ్ర – కలిదిండి : దాతల సహాయంతో ఆలయాలు అభివృద్ధి సాధ్యమని శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కలిదిండి భోగేశ్వరలంకలో కొలువై ఉన్న శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారి దేవస్థానం స్వామి వారిని దర్శించుకుని, స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్ష సమా వేశంలో పాల్గొ న్నారు. ఈ సంద ర్భంగా కామినేని మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ గొప్ప చరిత్ర కలిగిన ఇలాంటి దేవాలయాలు అభివృద్ధి చేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొత్త నిర్మాణాలతో

దేవాలయాల రూపురేఖలు మార్చి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కువ నిధులు వెచ్చించి పాత బడిన దేవాలయాలకు పూర్వ వైభవం రప్పిస్తున్నారు. ప్రభుత్వం వారు అందించే నిధులు సద్వినియోగం చేసుకుని ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని దేవస్థాన సిబ్బందికి, కమిటీ సభ్యులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామకృష్ణ, ఈవో శింగనపల్లి. శ్రీనివాసరావు, టిడిపి, బిజెపి మండల అధ్యక్షులు జోగిరాజు, దుర్గాప్రసాద్, మాజీ ఏఎంసి చైర్మన్ వల్లభనేని. శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, పేటేటి. సత్యనారాయణ, ముద్దం భోగేశ్వరరావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి : షష్ఠి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లో వేంచేసియున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి కళ్యాణ మహోత్సవాలలో ఎమ్మెల్యే స్వామి వారి పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహిం



చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారి చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. షష్ఠి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉప్పలపాటి విమల, వడ్లమాని నాగలలిత, నీలం శివరమేష్, పరసా కృష్ణ, బురుబోయిన సోవమ్మ, కొట్టి సుబ్బలక్ష్మి, తగాని నాగలక్ష్మి, బెజవాడ నాగ వెంకట రాధాకృష్ణ, భట్టిప్రోలు నాగశిరీష, శొంఠి నాగకొండ, నాయకులు కొత్తూరు విఠల్, ఏఎస్ బాబు, పైడిపాటి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 13న సదస్సు

విశాలాంధ్ర -ఏలూరు: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వార్షికోత్సవాల గౌరవార్ధం 2025 డిసెంబర్ 13న ఏలూరులో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే యం యు) ఆధ్వర్యంలో భూ సమస్యలపై రాష్ట్ర సదస్సు జరుగుతుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర భూ సదస్సుకు సంబంధించిన చేతి పత్రికలను మంగళవారం నాడు ఏలూరులో సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో బికేయంయు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురవయ్య, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 9/77 అసైన్డ్ భూముల చట్ట సవరణ, భూ సంస్కరణల చట్టం, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు, వన సంరక్షణ సమితులు, అటవీ హక్కుల సంరక్షణ చట్టాలు,పేదల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు, పోడు భూములకు హక్కుపత్రాలు, నివాస భూములకు పట్టాలు తదితర సమస్యలపై సదస్సులో చర్చించి కార్యాచరణను రూపొందించ నున్నట్టు తెలిపారు. రాష్ట్ర సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి సుమారు 350 మంది వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు విచ్చేస్తారని తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ప్రధాన వక్తగా దారిదీపం పత్రికా సంపాదకులు డివివిఎస్ వర్మ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు జల్లి విల్సన్,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ కోటేశ్వరరావు,ఆవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు,బి కే యం యు జాతీయ కార్యవర్గ సభ్యులు బి కేశవరెడ్డి,సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొంటున్నారని గురవయ్య, వెంకటేశ్వరరావు తెలిపారు. సదస్సు జయప్రదానికి, ఉద్యమ శ్రేయోభిలాషులు సహాయ సహకారాలు అందించవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. చేతి పత్రాల ఆవిష్కరణలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే యం యు) జిల్లా సహాయ కార్యదర్శులు గోలిమే బాల యేసు, కూరాకుల బాబురావు, బికేయంయు నాయకులు టీవీఎస్ రాజు, పొట్టేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్ లతో పాటు ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా సహాయ కార్యదర్శి పి. కిషోర్, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, కార్యకర్తలు బి. యేసు రత్నం, కనకం జగన్, బి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదన పనులను సీఎం దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే ధర్మరాజు

విశాలాంధ్ర- ఉంగుటూరు: గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి ప్రతిపాదన పనులను సిద్ధం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళ వారం ఉంగుటూరు మండలంలో చేబ్రోలు, గోపినాథపట్నం, గొల్లగూడెం, గోపాలపురం, నల్లమాడు, రామచంద్ర పురం, యర్రమిల్లిపాడు గ్రామాల సచివాలయాల వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులు కూటమి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల అభివృద్ధి అవసరాలు, ప్రాధాన్యతా సమస్యలు, చేపట్టవలసిన పనులపై విస్తృతంగా చర్చించి, ప్రతి పంచాయతీ వారీగా అభివృద్ధి వివరాలను నివేదిక రూపంలో సేకరించారు. చేబ్రోలు సమావేశంలో త్వరలో నిర్మించబోయే రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌కి సంబంధించిన ప్రణాళికపై సమగ్ర చర్చ జరిగింది. గ్రామంలో ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, పలు సిసి రోడ్లు, నూతన పైప్‌లైన్ నిర్మాణం, నారాయణపురం నుండి చేబ్రోలు పోలీస్ స్టేషన్ వరకు సర్వీస్ రోడ్ ఏర్పాటు గురించి అధికారులతో సమీక్షించారు. పుంత రోడ్డుల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి కొత్త రోడ్లు నిర్మించాలన్న ప్రజా ప్రతినిధుల అభ్యర్థనలను ఎమ్మెల్యే శ్రద్ధగా పరిశీలించారు. గ్రామాల్లో చెరువుల పునరుద్ధరణ, పుంత రోడ్ల నిర్మాణం, రక్షిత మంచినీటి ట్యాంకులు, డ్రైనేజి పనులు, శ్మశానవాటికల అభివృద్ధి వంటి అంశాలను

ప్రజా ప్రతినిధులు ప్రస్తావించగా, అన్ని సమస్యలపైనా అధికారులు తక్షణం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, అంగన్వాడీ, పాఠశాల భవనాల వివరాలను పూర్తి నివేదికగా సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశాల అనంతరం ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులను బలోపేతం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా చేసి అభివృద్ధి చేయటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. సమావేశంలో ఉంగుటూరు ఎంపీడీవో మనోజ్, డిప్యూటీ ఎంపీడీవో రమేష్ బాబు, సర్పంచులు రాందే లక్ష్మి(చేబ్రోలు), తమ్మిన శ్రీనివాస్ రావు (మిర్రమిల్లిపాడు), పుత్సకాయల విష్ణు(గోపీనాథ్ పట్నం) కార్యదర్శులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మధ్య ఘర్షణలు

ఏఐఎస్ఎఫ్, ఏలూరు జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్

విశాలాంధ్ర – ఏలూరు : ప్రభుత్వ వైద్య కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటు న్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ విమర్శిం చారు. ఏలూరులోని వైద్య కళా శాలలో విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడటం బాధాకర మన్నారు.వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థుల మధ్య ర్యాగింగ్ జరుగుతుందని

తెలిసినప్పటికీ కళాశాల యాజమాన్యం, హాస్టల్ వార్డెన్ విద్యార్థులను పట్టించుకోకపోవడం వల్లే సీనియర్ విద్యా ర్థులు ర్యాగింగ్ పేరుతో జూనియర్ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు చదవాలంటే ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ఏడాది వైద్య కళాశాల హాస్టల్లో ఎలుకలు వస్తున్నాయని విద్యార్థులు ఇబ్బందికి గురవటం జరిగిందనే విషయాన్ని గుర్తు చేశారు. హాస్టల్లో భోజన సౌకర్యాలు సక్రమంగా లేవంటూ వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో జరుగుతున్న అరాచకాలను అరికట్టడంతో పాటు జిల్లా అధికారులు కళాశాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్లు నిర్మించండి : సీపీఐ

విశాలాంధ్ర – కొయ్యలగూడెం : పరింపూడి గ్రామపంచాయతీ పరిధి కొయ్యలగూడెం అశోక్ నగర్ శివారున గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన కాలనీలో సిసి రహదారులు నిర్మించి, వీధిలైట్లు, మంచి నీటి సదుపాయం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజ నేయరాజు, పోలవరం నియోజకవర్గ

శాసనసభ్యులు చిర్రి బాలరాజును కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆంజనేయరాజు కాలనీలో ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులు కాలనీలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయక కార్యదర్శి లక్క లక్ష్మణరావు, ఏఐటీయూసీ నాయకులు పులపాకుల దుర్గారావు, ఎస్ కే బాజీ, మిరియాల రమేష్, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర – కలిదిండి: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసన సభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలం లోని గురవాయిపాలెం గ్రామంలో నాంది, సనోఫీ, గ్రామ ప్రజల

ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు ఈ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించటం వలన తక్కువ ధరకే గ్రామస్థులకు త్రాగునీరు అందజేస్తారన్నారు. ఈ వాటర్ ప్లాంట్ నిర్మించటానికి మంచినీటి చెరువు అభివృద్ధి చేయడానికి కష్టపడింది గ్రామంలో చదువుకున్న యువత అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, అంకాల దుర్గాప్రసాద్, సర్పంచి బత్తిన ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి సుబ్బరాజు కృషి ఎనలేనిది

విశాలాంధ్ర- తణుకు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు భూపతి రాజు సుబ్బరాజని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం సుబ్బరాజు వర్ధంతి సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల పార్క్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రవీంద్రనాథ్, డివిఎస్ వర్మ , డాక్టర్ బి. రమేష్ చంద్రబాబు , సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పలువురు ప్రముఖులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సుబ్బరాజు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడని చెప్పారు. కామ్రేడ్ వంకా సత్యనారాయణ సమకాలికులని పేర్కొన్నారు. వారిరువురూ 1943 సంవత్సరంలో ఒక సంవత్సరం జైలు జీవితం గడిపారని తెలిపారు. కోనాల భీమారావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సంకు మనోరమ, డాక్టర్ వత్సవాయి వెంకటరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కోడూరి ఆంజనేయులు తదితరులు మాట్లాడారు. పలువురు ప్రముఖులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కళ్యాణ మండపాన్ని పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : టీటీడీ కల్యాణ మండపాన్ని పునరుద్ధరించాలని వైసీపీ నాయకులు, పరింపూడి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ సంకు కొండలరావు, పోల వరం నియోజకవర్గ శాసనసభ్యులు మంగళవారం పరంపూడి పంచాయితీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన జనవాణి కార్యక్రమంలో వినతిపత్రం ద్వారా ఆయనను కోరారు. కొండలరావు మాట్లాడుతూ మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, తాడేపల్లిగూడెం రోడ్డు పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించాలని, పరింపూడి గ్రామంలో కాపులకు ప్రత్యేకంగా స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, ఎస్సీలకు కూడా స్మశాన వాటిక లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి కూడా స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, చేపల పేట నుండి వైయస్సార్ లేఅవుట్ వరకు సిసి రహదారి నిర్మించాలని శాసన సభ్యుల వారిని కొండలరావు కోరారు.

రైతులకు ఉచితంగా టార్పాలిన్లు

విశాలాంధ్ర -పోలవరం : పోలవరం మండలంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఉచితంగా టార్పాలిన్లు అందజేశామని పోలవరం అగ్రికల్చర్ అధికారి కె. రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో తుఫాన్లు, అకాల వర్షాలు రావడంతో రైతులు పండించిన పంట పొలాల్లోనే తడిసిపోతుందని ప్రభుత్వం గుర్తించి ఈ బరకాలను అందజేసిందని తెలిపారు. ప్రతి రైతు వాతావరణం అనుకూలించినప్పుడల్లా ఈ బరకాలను పంట పొలాల్లోకి తీసుకువెళ్లి ధాన్యం పాడవకుండా వాటిపై కప్పాలన్నారు. ధాన్యం అమ్మిన తర్వాత జాగ్రత్తగా మళ్లీ మీరు తీసుకెళ్లిన సొసైటీల వద్ద బరకాలు అప్పచెప్పాలని రైతులకు సూచించారు. పాతపట్టిసీమ సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర -చాట్రాయి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ చాట్రాయి మండల అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వర రావు గుర్తు చేశారు. మంగళవారం మండల కేంద్రమైన చాట్రాయి గ్రామానికి చెందిన కరెడ్ల మహేశ్వరరావు అనే కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి కొత్తగా మంజూరైన పదివేల రూపాయల పింఛను అందజేశారు. కార్యక్రమంలో పరిషత్ అభివృద్ధి అధికారి రాజు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల మధ్య ఘర్షణలు సృష్టిస్తే కఠిన చర్యలు

మంత్రి పార్థసారధి

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు మండలం దేవరగుంట, జంగంగూడెం గ్రామాల మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న ఘర్షణ గొడవలు ఎట్టకేలకు సామరస్యంగా ముగిసింది. గత కొంతకాలంగా ఇరు గ్రామాల ప్రజలు ఫారెస్ట్ భూమి కోసం ఘర్షణలు పడుతున్న సంగతి తెలుసుకొని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులతో కలిసి ఇరు గ్రామాల ప్రజలను, సాగు రైతులను పిలిపించి ఇరు పక్షాలతో మాట్లాడి పట్టాల వివరాలు, సాగు రైతుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యా సాధ్యాలను బట్టి అధికారులకు బోర్డర్లు కేటాయించి ఎవరిది వారికి బౌండరీలు కేటాయించాలని అధికారులకు హెచ్చరించారు. పట్టాలో ఉన్న భూమి తప్ప ఒక్క సెంటు కూడా ముందుకు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిగిలిన ఫారెస్ట్ భూమిని పశుగ్రాసానికి కేటాయించి సరిహద్దులు నియమించాలని

అధికారులకు మంత్రి సూచించారు. సబ్ డివిజన్లు చేయలేదని వంకతో ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరు గ్రామాల సాగు రైతులు కేటాయించిన సరిహద్దు దాటి ముందుకు వస్తే కఠిన చర్యలు తప్పవని పట్టాలు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మిగిలిన రైతులకు పట్టాలు అందించే ప్రయత్నం చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాల అభివృద్ధి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, నారా లోకేష్ సారధ్యంలో రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలోనే పోలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం కొయ్యల గూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ముందుగా రాజవరం గ్రామపంచాయతీ పరిధి గంగవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు శంకుస్థాప నిర్వహించారు. అనంతరం మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణం నుండి కన్నాపురం గ్రామం వరకు మూడు కోట్ల 40 లక్షల రూపాయల నిధులతో ఏడు కిలోమీటర్ల మేర నూతన రహదారికి శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని గుత్తేదారులకు సూచించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏడి బుజ్జిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతన్న నీకోసం కార్యక్రమంలో హాజరయ్యారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతుల కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటును కల్పిస్తుందని తెలిపారు. అనంతరం పరింపూడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమం శాసనసభ్యులు చిర్రి బాలరాజు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామాల ప్రజలు ఆయనకు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు.

కొయ్యలగూడెం నుండి కన్నాపురం వెళ్లే రహదారి ఇరుకుగా తయారై ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని సమస్యలు పరిష్కరించాలని గ్రామానికి చెందిన పూలపల్లి కృష్ణబాబు వినతి పత్రాన్ని అందచేయగా, శాసన సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత పోలీస్, రెవెన్యూ, పంచాయితీ అధికారులకు ట్రాఫిక్ సమస్య త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గవరవరం గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన కమ్యూనిటీ స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించుకొని ఎస్సీ కాలనీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గవరవరం ఎస్సీ కాలనీకి చెందిన జొన్నకుటి నాగరాజు వినతి పత్రాన్ని అందజేశారు. కొయ్యలగూడెం ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మించాలని బాబు జగ్జీవన్ రామ్ కమిటీ అధ్యక్షులు బొబ్బర చిట్టిబాబు శాసనసభ్యులను వినతిపత్రం ద్వారా కోరారు. మండలంలో 142 మంది వారి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాల ద్వారా విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాలదేవి, ఎస్టి కమిషన్ మెంబర్ కాకి లక్ష్మి,మండల అధ్యక్షులు తోట రవి, పట్టణ అధ్యక్షుడు మదేపల్లి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు దుగ్గిన శ్రీను, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు, పలు గ్రామాల ప్రజలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నవోదయ విద్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేయండి

ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

విశాలాంధ్ర -ఏలూరు : రాష్ట్రంలోని 15 నవోదయ విద్యాలయాల్లో 407 ఉపాధ్యాయ పోస్టులకు గాను, 171 ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్రంలోని నవోదయ విద్యాలయాలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్ సభలో కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇచ్చారు. దేశంలో ప్రతి జిల్లాలో ఒక నవోదయ విద్యాలయం ఉండాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని, గత ఐదేళ్లలో దేశంలో 28 నూతన నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాలకు గాను ఏలూరు సహా 13 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ఉన్నాయని మిగిలిన జిల్లాల్లో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. 13 జిల్లాల్లో ఉన్న15 నవోదయ విద్యాలయాల్లో 407 బోధనా సిబ్బంది, 322 బోధనేతర సిబ్బంది పోస్టులు ఉండగా, 171 బోధనా సిబ్బంది (42%), 155 బోధనేతర సిబ్బంది (48%) పోస్టులు ఖాళీలు ఉన్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇంత భారీగా ఖాళీలు ఉండిపోవడం విద్యార్థులపై ప్రభావం చూపుతుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

తారకాపురి లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే రాధాకృష్ణ

విశాలాంధ్ర- తణుకు: తారకపురి లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని స్థానిక శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణఅన్నారు. మంగళవారం స్థానిక ఇంపల్స్ జూనియర్ కళాశాలలో ప్రెసిడెంట్ వావిలాల పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ ద్వారా పవన్ కుమార్ పేద ప్రజలకు మరెన్నో సౌకర్యాలు సేవలు అందించాలని కోరారు. ప్రెసిడెంట్ పవన్ కుమార్, సెక్రెటరీ రామ్ కుమార్, ట్రెజరర్ గోపికృష్ణ లను అభినందించారు. అనంతరం వావిలాల సరళాదేవి మాట్లాడుతూ ఈ క్లబ్ ప్రారంభించినప్పటి నుంచి అనేకమంది నిరుపేదలకు అవసరమైన సేవలు అందిస్తూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. డెంటల్, గైనిక్, డయాబెటిక్ ,జనరల్ మెడిసిన్, ఐ సంబంధించిన వైద్యులను తీసుకువచ్చి పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మెడికల్ క్యాంపు సహకరించిన డాక్టర్లు డాక్టర్ సత్యవతి, డాక్టర్ గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ చాముండేశ్వరి, డాక్టర్ రోజా, ఇంపల్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్ కుమార్ లను ఆమె అభినందించారు. ఈ క్యాంప్లో 1000 మందికి వైద్య సేవలు అందించారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బెజవాడ సూరిబాబు, ఎ. సత్యనారాయణ, బత్తుల వెంకటరమణ ,క్లబ్ నాయకులు సూర్యనారాయణ రాజు, బాపూజీ రావు ,జెడ్ సి పద్మావతి ,చీకటి శ్రీనివాస్ ,వావిలాల ప్రసన్న, వావిలాల వెంకట రమేష్, జ్యోతి, జి గుప్త రమేష్, ఆనంద రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు.

గ్రంథాలయ అభివృద్ధికి శ్రీనివాసరావు కృషి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: గ్రంథాలయ అభివృద్ధికి శ్రీనివాసరావు ఎంతగానో కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం ప్రథమ శాఖ గ్రంథాలయ అధికారి వి. శ్రీనివాసరావు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు, రవికుమార్ , గ్రంథాలయ అధికారి సాయిబాబా, జాన్‌బాబు మాట్లాడుతూ చదువరులకు గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలు, ఇతరత్రా సామాగ్రిని దాతల సహకారంతో సమీకరించారన్నారు. ఆయన కృషి మరువలేనిదన్నారు. అనంతరం గరికపాటి బాపయ్య శర్మ, శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు.

రైతన్న మీకోసం ముగింపు సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నల్ల జర్లలో మూడవ తేదీ బుధ వారం ఉదయం 11 గంటలకు రైతన్న మీకోసం ముగింపు సభను విజయ వంతం చేయాలని దేవరపల్లి మండలతెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్ పేర్కొన్నారు దేవర పల్లిలో మంగళవారం పెనుమత్స సుబ్బరాజు స్వగృహం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం 11 గంటలకు గోపాలపురం నియోజకవర్గంలో నల్లజర్ల గ్రామంలో రైతన్న మీకోసం సభలో పాల్గొం టారని తెలిపారు. మండలంలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు అభిమానులు ఉదయం 9 గంటలకు దేవరపల్లి నుండి బయలుదేరి 10 గంటలకు నల్లజర్ల చేరుకోవాలని అన్నారు. రైతన్న మీకోసం సభలో ముఖ్యమంత్రి పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతారని తెలిపారు ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమం జరుగుతోందని ఆంద్రు అనిల్ తెలిపారు ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గన్నమణి హరికృష్ణ ముళ్ళపూడి దొరాజి చౌదరి పెనుమత్స సుబ్బరాజు ఉప్పులూరి రామారావు కంటిపూడి సుబ్బారావు ఆచంట చిన్న శేషారావు కరుటూరి శ్రీరామమూర్తి నున్న చిన్ని దంపనబోయిన బ్రహ్మ రాజు కొయ్యలమూడి తాతారావు పిన్నమనే సత్యనారాయణ గన్నమని గోపాలకృష్ణ కొయ్యలమూడి గాంధీ నందిగం శ్రీధర్ గెడ రామ నరసింహారావు కురుకూరి రాంబాబు కాట్రగడ్డ గాంధీ కొయ్యలమూడి చందు మింటిమి సురేష్ యాగంటి వెంకటరత్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కౌశల్ సైన్స్ క్విజ్ రాష్ట్ర స్థాయి పోటీలకు చైతన్యనగర్ విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం మాధవరాయుడి పాలెం గ్రామం చైతన్య నగర్ లో నూతనంగా ఏర్పాటు చేయబడిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి యజ్జల వీర వెంకట విజయ వర్ధన్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కౌశల్ జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ లో ప్రథమ స్థానం పొంది డిసెంబర్ 27వ తేదీన తిరుపతిలో జరిగే భారతీయ విజ్ఞాన సమ్మేళనం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా విజయ వర్ధన్ మా గ్రామం నుంచి ఎంపిక కావడం మాకు గర్వకారణం అని మాధవరెడ్డి పాలెం గ్రామ సర్పంచ్ అన్నదేవుల వీర వెంకట సత్యనారాయణ (చంటి) పేర్కొన్నారు. విద్యార్థికి సైన్స్ పుస్తకాన్ని మెమొంటోని ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని మధిర వెంకట కృష్ణ కామేశ్వరి, గైడ్ టీచర్స్ గండి స్వామి ప్రసాద్, మహమ్మద్ షెహన్స షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ వర్ధన్ ను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మల్లవరపు నాగమణి, కౌశల్ మండల కోఆర్డినేటర్ చింతలపూడి శ్రీనివాస భరద్వాజ, ఉపాధ్యాయులు రాయుడు విజయలక్ష్మి, గొర్రె చాందిని, బిఎస్ చక్రవర్తి స్థానిక నాయకులు బొల్లా ధనుంజయ్, ఆరుగొల్లు పెద పోశయ్య తదితరులు అభినందించారు.

ఆటల పోటీలతో శారీరక ఆరోగ్యం

విశాలాంధ్ర- దేవరపల్లి: స్టేట్ లెవెల్ పాలసీలో భాగంగా దేవరపల్లి మండలం లోని ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు పురుషులు భాగంలో క్రికెట్ స్త్రీలయ భాగంలో ఎంపికలు అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఐ సూర్యనారా యణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ అప్పారావు, మండలం లోని యాయామ ఉపాధ్యాయులు స్కూల్ అసి స్టెంట్లు పాల్గొన్నారు ఎంపికైన పురుషులు క్రికెట్ జట్టు స్త్రీలు తూబాల్ జట్టు ఈనెల 12 13 తేదీల్లో జరిగే డివిజన్ స్థాయిపోటీల్లో పాల్గొంటారని సూర్యనారాయణ తెలి పారు. ఎంపికైన వారిని ఈ సందర్భంగా అభినందించారు . పురుషుల క్రికెట్ జట్టు విభాగం ఎంపికైన వారు చందర్రావు ఎం వెంకటరాజు పిటి మహేష్ ఎం అబ్బులు ఎస్ వెంకటేశ్వరావు శ్రీనివాస్ రెడ్డి పివి రామారావు కె మాణిక్యం ఓ నాగరాజు బుజ్జిబాబు ఏ సతీష్ త్రో బాల్ కు సెలెక్ట్ అయిన మహిళా టీచర్లుకే వనిత డి రామా జానకి కె వెంకటలక్ష్మి ఎం మాధవి వి సంధ్య ఎన్ కోయిల ఎంపికైనట్లు తెలిపారు

రూ 42.5 లక్షలతో సింహాచల నగర్‌లో పార్కు అభివృద్ధి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటి : ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఆ దిశగానే మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేస్తు న్నామన్నారు. స్థానిక 49వ డివిజన్ సింహాచల నగర్ లో రూ 42లక్షల 50వేలతో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులకు మంగళవారం ఉదయం ఆయన కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లా డుతూ ఈ ప్రాంతంలో అధ్వాన్నంగా ఉన్న పార్కును ఆరోగ్య రాజమండ్రిలో భాగంగా తీర్చి దిద్దుతున్నామని వివరించారు. అసాంఘిక శక్తులు రాకుండా, పక్కాగా పార్కు రూపురేఖలు మారుస్తామన్నారు.. తాము ఎందుకు అభివృద్ధి చేయలేక పోయామా అని వైసిపి వాళ్ళు భావించే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. ప్రచారం కోసమో, హంగామా కోసమో కాకుండా స్థానిక ప్రజలు అవసరమ నుకున్న చోట అభివృద్ధి చేపడుతున్నామన్నారు. పార్కు నిర్వహణ రెండేళ్లపాటు చూసుకునేలా టెండర్లు పిలిచే బాధ్యత కూడా తీసుకుంటామని తెలిపారు. దీంతో పాటు 50డివిజన్ లో 4పార్కులు, 1వ డివిజన్ లో రెండు పార్కులు కూడా అభివృద్ధి ప్రస్తావిస్తూ, ఐదు దశల్లో నగరంలో 30పార్కులు అభివృద్ధి చేస్తున్నామని ఆయన వివరించారు. రూ 9లక్షలు వెచ్చించి, డ్రైనేజి కూడా నిర్మాణం చేయ బోతు న్నామన్నారు. మోటారు కూడా అవసరమనుకుంటే అది కూడా చేసిపెట్టామని ఆయన తెలిపారు. ఆరోగ్య రాజమండ్రిలో భాగంగా క్రమం తప్పకుండా ప్రతి రెండు నెలల కొకసారి డ్రైన్స్ అన్నీ డీసిల్టింగ్ చేయిస్తున్నామన్నారు. డ్రైన్ బ్లాక్ అయితే ప్రజలకు వచ్చే ఇబ్బంది ఏమిటో తెలుసు కనుక ఈవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైన్ నిర్మాణం చేయడమే కాదు, దాని నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లక్ష్యం కార్యకర్తలను నాయకులను చేయడమే: అంబా పస్రాద్

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భావన రమేష్ అధ్యక్షతన నియోజవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం భాగంగా నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఝార్ఖండ్ ఎమ్మెల్యే అంబాప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టికే విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబా ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ కార్య కర్తలు అందరూ గ్రామస్థాయిలోకి వెళాలని, కాంగ్రెస్‌పై అంకితభావం ఉన్న వ్యక్తులను గుర్తించి నాయకులుగా తీర్చిదిద్దాలాన్నారు. కార్యకర్తలు అందరూ నాయకులయ్యే అవకాశం ఇవ్వాలని అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అబ్జర్వ ర్‌గా తనను ఇక్కడకు పంపించారని ప్రసాద్ అన్నారు. అనంతరం కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర మాట్లాడుతూ ఇకనుండి కాంగ్రెస్ పార్టీని బలోపే తం చేయడం కోసం త్వరలోనే ఒక రూపకల్పన చేసి ప్రతి గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ దేశానికి చేసిన సేవలను ప్రజలకు వివరించడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, సుజాత, కాకి కిషోర్, భాస్కర్ ప్రసాద్, కటిక శ్రీను,రమణ పాల్గొన్నారు.

రైతులు సాగులో ఆధునిక పద్ధతులను పాటించాలి

విశాలాంధ్ర - సీతానగరం: రైతులు సాగులో ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు అని కోరుకొండ ఏ డి ఏ శశిబిందు అన్నారు. మండలంలోని సింగవరం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి గౌరీదేవి ఆధ్వర్యంలో ఏ డి ఏ శశిబిందు ముఖ్య అతిథిగా పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులతో మాట్లాడుతూ రబీ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి మూడు పంటలకు ఒకసారి జింక్ పొలంలో తప్పనిసరిగా పిచికారి చేసుకోవాలని అన్నారు. అలాగే రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా జరుగుతున్న కొనుగోలు ఏటువంటి సమస్యలు ఉన్న అధికారులు దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా నేడు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని రైతులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏలు, రైతులు పాల్గొన్నారు.

సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం, వస్త్ర దానం

విశాలాంధ్ర - గోకవరం : గీతా జయంతి సందర్భంగా గోకవరం గీతామందిరం వద్ద సూర్య పీఠం ట్రస్టు ఫౌండర్ తోట సాయిబాబా ఆధ్వర్యంలో అన్నదానం వస్త్ర దానం నిర్వహించారు ఈ సందర్భంగా సాయిబాబా, సూర్య పీఠం స్థలదాత అక్షింతల రాజా మాట్లాడుతూ గీతా మందిరం వద్ద దీర్ఘకాలంగా పాంచమాస్య వ్రతాన్ని నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా ఆషాడశుద్ధ ఏకాదశి మొదలు కొని మార్గశిర శుద్ధ ఏకాదశి వరకు ప్రతిరోజు పేదలకు అన్నదానం చేస్తున్నామని మంగళవారం పూర్ణాహుతితో ఈ వ్రతం పరిసమాప్తి అయిందన్నారు. అన్నదానం నిమిత్తం స్వర్గీయ వసుంధర జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ. 15000విరాళమిచ్చారన్నారు.

ర్యాగింగ్ మహమ్మారికి దూరంగా ఉండాలి

- లెనోరా దంత కళాశాలను సందర్శించిన డిసిఐ సభ్యులు అమన్ సచిదేవా

విశాలాంధ్ర - రాజానగరం : ర్యాగింగ్ మహమ్మారికి బావి వైద్యులు దూరంగా ఉండాలనీ, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డిసిఐ)సభ్యులు డాక్టర్ అమన్ సచిదేవా అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలోని కెఎల్ ఆర్ లెనోరా దంత వైద్య కళాశాల సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వప్రకాశ్ శెట్టి అధ్యక్షతన, పీజీ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మణరావు నేతృత్వంలో ర్యాగింగ్ వ్యతిరేక(యాంటి ర్యాగింగ్) అంశాలపై విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన సదస్సుకు డిసిఐ సభ్యులు డాక్టర్ అమన్ సచిదేవా ముఖ్య అతిథిగా విచ్చేశారు. దీనిలో భాగంగా దంత కళాశాల, దంత ఆసుపత్రి ప్రాంగణాలు పరిశీలించారు. నూతన వైద్య పరికరాలు, ప్రాంగణ పరిశుభ్రత వంటి అంశాలు గమనించిన ఆయన కలశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ భూతానికి విద్యార్దులు దూరంగా ఉండాలని, ఏ ఒక్కరు కూడా ఉతమివ్వద్దని హితవు పలికారు. రాగింగ్ వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలు చెప్పారు. సురక్షితమైన కళాశాల వాతావరణం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సంస్థ డైరెక్టర్ జి.నాగా ర్జున రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్యార్థుల పాత్ర, పరస్పర గౌరవం, ర్యాగింగ్ నిర్మూలనలో ప్రతి విద్యార్థి చురుకైన పాత్ర పోషించాలన్న సందేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తొలుత అతిథులను ప్రిన్సి పల్ డాక్టర్. విశ్వప్రకాశ్ శెట్టి, పీజీ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. దాల్సింగ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అలాగే శాలువ కప్పి షీల్డ్ అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల, ఆసుపత్రికి చెందిన వివిధ శాఖల అధికారులు, విద్యార్దులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ పేరుతో అన్నదానం

విశాలాంధ్ర – జగ్గంపేట : జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తన తండ్రి తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ పేరుతో అన్నదాన కార్యక్రమం ప్రతి మంగళవారం జరుగుతుంది. ఈ అన్నదాన కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు జనసైనికులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ తన సొంత ఖర్చులతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటివరకు నిర్విరామంగా ప్రతి వారం డొక్కా సీతమ్మ పేరుతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో ప్రజాభిమానం రమేష్ పొందారు.

నేడు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర – కరప : అంతర జిల్లాల 11వ సీనియర్ పురుషుల హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ ఈనెల 4న కర్నూలు జిల్లా నందు జరుగుతున్నందు, జిల్లా కమిటీ సెలెక్షన్ టీం ఛైర్మన్ ఎం సుకుమార్, డైరెక్టర్ రోషిత్, రమేష్ ఆధ్వర్యంలో ఈనెల 3న బుధవారం ఉదయం 10 గంటలకు పనసపాడు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నందు ఎంపిక చేసి పంపించడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రియాంక శర్మ తెలిపారు. క్రీడాకారులు ఐదు పాస్పోర్ట్ కాపీలు, ఆధార్ జిరాక్స్ తీసుకు రావాలని, అటునుండి అటేవెళ్ళవలసివుంటుంది. కావున బ్యాగ్ సర్దుకుని రావాలని జిల్లా కమిటీ ప్రెసిడెంట్ ఎం దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు.

పెద్దెవం సర్పంచ్‌కి ప్రోటోకాల్ అవమానం

విశాలాంధ్ర – తాళ్లపూడి : పెద్దెవం గ్రామంలో కొవ్వూరు ఎమ్మెల్యే డ్రైన్ శంఖుస్థాన కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యం లో స్థానిక సర్పంచ్ తీగిరిపల్లి వెంకట్రావు కు ప్రోటోకాల్ లేకుండా చేయటం ఎస్సి సర్పంచ్‌కి అవమానం జరిగిం దనబ్లేనని వైకాపా నాయకులు, ఉపసర్పంచ్ తోట రామ కృష్ణ పేర్కొ న్నారు. ఈ మేరకు ఆయన సమావేశం ఏర్పాటు చేశారు.

తీర్మానాలు లేకుండా పనులు చేస్తున్నట్లు వైకాపా నాయకులు ప్రజలను మభ్య పెడు తున్నారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. ఎన్డీయే కూటమి లోని జనసేన పార్టీ కార్యకర్తలు కోరగా పార్టీలకి అతీతంగా సచివాలయం ఎదురుగా డ్రైన్ నిర్మాణానికి తీర్మానం ఇచ్చి పనులు తాము చేపట్టిన పనిని వంక పెట్టి అపిన ఘనత ఎన్డీయే పార్టీ దేనని తోట గుర్తు చేశారు. గ్రామం లో ఒకసారి శంఖుస్థాపన చేసిన పనులకు మరో సారి శంఖుస్థాపన చేసిన ఘనత కూడా టీడీపీ దే నని తోట అన్నారు. తీర్మానాలు లేకుండా భూమి పూజ చేసిన ఘనత కూడా ఎన్డీయే పార్టీదేనని, దీనికి 8 వార్డులో ఎంపీ వచ్చిన సందర్భం లో శిలా ఫలకం వేసి నేటికీ పనులు ప్రారంభించని సంఘటనే ఉదాహరణ అని అన్నారు. గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ కి ప్రోటోకాల్ అవమానం పట్ల జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు బట్టు సుబ్బారావు, కోడి గంగరావు, నరాలశెట్టి రామకృష్ణ, వీర్రాజు, వై.కృష్ణార్జునుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

"వికాస" ఆధ్వర్యంలో టాటా ఎలక్ట్రానిక్స్, హోసూర్ (బెంగుళూరు) కంపెనీలో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగానికి 150 మంది ఎంపిక

విశాలాంధ్ర – కాకి నాడ : "వికాస" ఆధ్వర్యం లో టాటా ఎల క్ట్రానిక్స్, హోసూర్ (బెంగుళూరు) కంపెనీలో మొబైల్ ఆపరే టర్ ఉద్యోగానికి ఎంపికైన సుమారు 150 మంది అభ్యర్థులు బస్సులో మంగళ వారం కలెక్టరేట్ నుండి కంపెనీకి పంపించారు. ఈ కార్యక్రమానికి డీఆర్వో



వెంకటరావు ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థులు బయల్దేరే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారికి ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాట్లు చేసినందుకు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె లచ్చారావుని అభినందించారు. ఈ సందర్భంగా పిడి లచ్చారావు మాట్లాడుతూ టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఇప్పటివరకు బ్యాచ్‌ల వారీగా సుమారు 500 మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికి ఉద్యోగం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆర్ఎస్‌కె సేవలను రైతులు సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర – పెద్దాపురం : రైతు శిక్షణ కేంద్రాలు (ఆర్ఎస్‌కె) సేవలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ ఛైర్మన్ తోట సుదీర్ అన్నారు. ఆంధ్ర పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామం శాఖ పరిధిలో ధాన్యం ఆరబెట్టిన కల్లాలను మంగళవారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సుదీర్ రైతులతో మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు రైతులందరూ రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలుకి సంబందించిన అన్ని సదుపాయాలు, గోనె సంచులు అందుబాటులో ఉంచామని, రైతులు ప్రస్తుతం ధాత్వ తుఫాను కార ణంగా వాతావరణం మార్పులు దృష్ట్యా ధాన్యాన్ని జాగ్రత్తగా చేసుకోవాల్సిందిగా కోరారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని తక్షణమే కల్లాలలో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించారని ధాన్యం కొనుగోలు సిబ్బందిని సూచించారు. రబీ సీజన్‌కి యూరియా కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్, రైతు సేవ కేంద్ర సిబ్బంది గ్రామ రైతులు, నాయకులు ఎలి శెట్టి చక్ర ప్రకాష్, వ్యవసాయ విస్తరణ అధికారి, రాగస్రవంతి, గ్రామ వ్యవసాయ సహాయ కులు గణేశ్వరరావు, ప్రవలీక, కె అఖిల్, అమృత వర్షిణి పాల్గొన్నారు.

వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర – ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు స్వామి వారి వసంత మండపంలో కళ్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వ హించారు. చందన సరూపుడైన వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి నిడదవోలు మండలం, పురుషోత్తపల్లి వాస్తవ్యులు సిరాపురపు కాశీ విశ్వనాథ్, చి శేషగిరి శ్రావణ్ కుమార్ మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 1,61,123లు విరాళంగా సమర్పించినారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, పులపర్తి రాంబాబు వర్మ, ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కూటమి ఎంపీల పనితీరులో ఉదయ్ శ్రీనివాస్‌కు రెండో స్థానం

విశాలాంధ్ర – కాకినాడ : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ఎంపీల పనితీరు పై పూణేకు చెందిన సెంటర్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ అండ్ సెఫాలాజికల్ (ఝూరారా) సంస్థ నిర్వహించిన సర్వేలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు రెండో స్థానం దక్కింది. నియోజక వర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు అందుబాటులో ఉండడం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై రాష్ట్రంలో కూటమి ఎంపీల ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజవర్గాల్లో సంస్థ సర్వే నిర్వహించగా 10కి 8.6 పాయింట్లతో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ రెండో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌ను ఘనంగా అభినందించారు.

గ్రామ సచివాలయాల పర్యవేక్షణ అధికారిగా ఉషారాణి

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : మండలం డిప్యూటీ ఎంపీడీవోగా జి ఉషారాణి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పెదపూడి గ్రామపంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శిగా పనిచేసిన ఉషారాణి పదోన్నతి పొంది బదిలీపై ప్రత్తిపాడు డిప్యూటీ ఎంపీడీవోగా వచ్చారు. మండలంలోని గ్రామ సచివాలయాలకు పర్యవేక్షణ అధికారిగా పనిచేస్తారని ఎంపీడీవో ఎవిఆర్ కుమార్ బాబు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉషారాణికి డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్, పరిపాలనాధికారి మూర్తి, ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, టైపిస్టు రత్నం, తదితర పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలియజేశారు.

శాంతివర్ధనం, పరిమళించిన మానవత్వం

- దివ్యాంగులను అమ్మగా లాలించి కన్నతల్లిగా చూస్తున్న సత్య, వీరబాబు దంపతులు
- నేడు ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

విశాలాంధ్ర – పెద్దాపురం : కన్నబిడ్డలను కంటికి రెప్పలా చూడడం తల్లిదండ్రుల బాధ్యత. వారికి మనం జన్మనిచ్చాం కాబట్టి. తల్లిదండ్రులను కన్నబిడ్డల్లా చూడడం మన ధర్మం. ఎందుకంటే వారు మనకు జన్మనిచ్చారు కాబట్టి. అయితే ఒకరిద్దరు బిడ్డలను సాకాలంటేనే ఎన్నో వ్యయప్ర యాసలు పడుతున్న ఈ రోజుల్లో సుమారు 150 మంది దివ్యాంగులు, మానసిక చిన్నారులైన (విభిన్న ప్రతిభావంతులు) బిడ్డల ఆలనా పాలనా చూసేందుకు ఆ తల్లి తన తాళి బొట్టును సైతం తాకట్టు పెట్టి వారి ఆకలి తీర్చిన అమ్మానాన్నలుగా సేవలం దిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహ కులు రాయవరపు వీరబాబు, సత్య దంపతులు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన రాయవరపు వీరబాబుకు చిన్నతనంలోనే ఓ కాలికి పోలియో సోకింది. వీర బాబుకు మనసులో ఎప్పుడూ ఓ ఆలోచన ఉండేది. తనలాగే వికలాంగత్వంతో బాధపడే వారి కోసం ఏదైనా చేయాలని భావించాడు. కంప్యూటర్ సెంటర్‌లో విద్యార్ధిని సత్య వీరబాబును ప్రేమించింది. ఆతడి భావాలు, ఆలోచనలు నచ్చడంతో తల్లిదండ్రుల అనుమతితో 2002లో ఆదర్శ వివాహం చేసుకున్నారు. భర్త ఆశయాన్ని విని తాను కూడా చేదోడు వాదోడుగా నిలవాల నుకుంది భార్య సత్య. మానసికంగా, అంగవైక ల్యంతో బాధపడే వారి కోసం ఏదైనా చేయాలని ఆలోచించారా దంపతులు. వారి ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిందే 'శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల

ప్రత్యేక ఆశ్రమ పాఠశాల.

2006లో పెద్దాపురం మండలం చంద్రమాం పల్లిలో ముగ్గురు పిల్లలతో ఓ పాత వీడియో థియేటర్లో ప్రారంభమైన ఈ పాఠశాల నేడు పులిమేరు కేంద్రంగా, అన్నవరం బ్రాంచితో వెరసి సుమారు 150 మందికి పైగా వీల్లలకు ఆశ్రయించే స్థాయికి ఎదిగింది. పాఠశాల ప్రారంభించిన మొదట్లో తాము, చేరదీసిన దివ్యాంగ బిడ్డలకు కడుపునిండా తిండి పెట్టేందుకు ఇంట్లో ఉన్న ఒక్కొక్క వస్తువునూ తాకట్టు పెట్టేశారు. ఒకానొక సమయంలో చివరకు తాళి బొట్టును కూడా తాకట్టు పెట్టి సొమ్ము తెచ్చి చిన్నారుల ఆకలిని తీర్చింది. ఏ బంధంలోని ఆమె అమ్మ ప్రతిరూపంగా నిలిచిన మహిళ అమ్మ సత్య. ఇక్కడ ఉంటున్న వారిలో చాలా మంది వివిధ రకాలుగా బాధపడుతూ ఆనాథగా మిగిలిన వారే. వారిలో కొందరికి వినిపించదు. మరికొందరికి రెండు కళ్లూ కనిపించవు. మరికొందరు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరు. చాలా మంది రాత్రిళ్లు అస్సలు నిద్రపోరు. వారందరికీ ఇప్పటికీ ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారా దంపతులు.

ప్రముఖుల సందర్శన : ఈ పాఠశాలను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన సోదరి షర్మిలారెడ్డి. మెగాస్టార్ చిరంజీవి వంటి పలువురు ప్రముఖులు గతంలో సందర్శించారు. పలు సందర్భాల్లో జిల్లాకు వచ్చిన వారు పాఠశాలను సందర్శించి చిన్నారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అంగవైకల్యం తెలియనివ్వటం లేదు మాది పిఠాపురం మండలం మంగతుర్తి నా పేరు ఎమ్ సత్తిబాబు. నన్ను 18 ఏళ్ల కిందట గ్రామంలో అందరూ కుంటోడు కుంటోడు అంటే ఏడువు వచ్చేది. అప్పుడే పులిమేరులో ప్రత్యేక పాఠశాల ఉందంటే మా అమ్మానాన్నలు ఇక్కడ చేర్పించారు. గ్రామాలలో పేద కుటుంబం కావడంతో ఇక్కడ చేరిన తరువాత కనీసం అంగవైకల్యం ఉందన్న ధ్యాస లేకుండా ఆనందంగా గడువుతున్నాను.

కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే కొండేటి రాజీనామా

విశాలాంధ్ర - మామిడికుదురు : పి గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తన రాజీనామాను ఆమోదించాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలకు లేఖ రాశారు. తెలుగుదేశం పార్టీలో చేరాలన్న ఆలోచనతో గత మూడు నెలలుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు దూరంగా ఉంటున్నారు. అయితే క్రింద స్థాయి నాయకులు నుంచి కొంత వ్యతిరేకత ఏర్పడడంతో టీడీపీలో చేరిక ఆలస్యమైంది. జిల్లాకి చెందిన ఒక మంత్రి, మరో ఎమ్మెల్యే సహకారంతో టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం అయిందని, పూర్తిస్థాయిలో గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పి గన్నవరం నియోజక వర్గ టీడీపీ ఇన్చార్జి పదవీ కోసం కొండేటి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

విద్యార్థులకు నైతిక అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - కొత్తపేట : విద్యార్థులకు నైతిక విలువల పై అవగాహన కల్పించాలని జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీం భాష సూచించారు. కొత్తపేట మండల పర్యటనలో భాగముగా మండల విద్యా శాఖా కార్యాలయంలో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లతో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించే చర్యలు పాఠశాలలో చేయరాదని, విద్యార్థులను ఫీజులు వసూలు నిమిత్తం వేధించరాదన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులను ఫీజుల బకాయిల పేరుతో పరీక్షలకు దూరం చేయుట వంటివి చేయకూడదన్నారు. పదవ తరగతి పరీక్షల సమయంలో విద్యార్థుల హాల్‌టికెట్ నిలిపి వేయడం వంటి చర్యలు చేయరాదని తెలిపారు. ప్రతి రోజు పాఠశాల అసెంబ్లీ కార్యక్రమములో విద్యార్థులకు నైతిక విలువలు గూర్చి తెలియజేయాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పరచి విద్యార్థుల ప్రగతిని, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించాలని తెలిపారు. ఈ సమావేశం వీజూ-1 ఎమ్ హరి ప్రసాద్ మరియు వీజూ-2 కె లీలావతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : అమూల్య

విశాలాంధ్ర - రాజోలు : రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి అమూల్య అన్నారు. మంగళవారం శివకోడు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నక్కా రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజోలు పీఏసీఎస్ చైర్మన్ కసుకుర్తి త్రినాథ స్వామి, కూటమి నాయకులు పినిశెట్టి బుజ్జి, మెరుగుమువ్వల ప్రసాద్, కడలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు వర్క్‌షాపు ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - నల్లజర్ల : గోపాలపురం నియోజక వర్గం నల్లజర్ల నేడు జరగనున్న రైతన్న మీకోసం ముగింపు సభ, వర్క్‌షాపు ఏర్పాట్లను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలసి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతుల కష్టాలు పంటల వివరాలు గురించి వ్యవసాయశాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్‌కు వివరించారు.

పేదలకు పెద్దన్న.. చంద్రన్న : ఎమ్మెల్యే దాట్ల

విశాలాంధ్ర - ఐ పోలవరం : పేదప్రజలకు అండగా ఉండాలనే లక్ష్యంతో ఆపదలో అండగా 80 కుటుంబాలకు 43.41 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు అందచేశారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ కార్యక్రమంలో 80 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.43.41 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర వైద్య ఖర్చులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ కీలకమైన పథకమని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఇది ఆశాకిరణంలా నిలుస్తోందనీ, ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వెంటనే మా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. పేద ప్రజలకు పెద్దన్న పాత్ర పోషిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆపదలో అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో కూటమి సీనియర్ నేతలు గుత్తులసాయి. ఐ పోలవరం మండల అధ్యక్షులు సాగిరాజు సూరిబాబు రాజు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర - అమలాపురం : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ మూడో తేదీ సందర్భంగా దివ్యాంగ సోదర సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలియజేయుచున్నాము. ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల మహా సంఘటన ఒక ప్రకటనలో తెలిపింది. దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగులను మరియు ప్రైవేటు ఉద్యోగాలలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. వివిధ శాఖలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేయాలని, 35 కేజీల బియ్యం అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, దివ్యాంగులకు అన్ని అవయవాలు బాగున్నవారు వివాహం చేసుకుంటే ఇచ్చే ప్రోత్సాహ బహుమతి వెంటనే ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రద్దు చేసిన పెన్షన్లను వెంటనే ఇవ్వాలని, పోలియో రెండు కాళ్ళు నడవలేని వారికి కాలు వంగిని వారికి పెద్ద తిరుపతి మరియు చిన్న తిరుపతి పరీక్షలు చేసి ఉచితముగా టైం పెట్టి ఆపరేషన్ చేయడుదురు. సోమ, బుధ, శుక్రవారం పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టైం పెట్టి ఆపరేషన్ చేయడుదురు. వివరాలు బాలాజీ వికలాంగుల ఆసుపత్రి చిన్న తిరుపతి ఏలూరు, జిల్లా బాలాజీ ఆసుపత్రి పెద్ద తిరుపతి చిత్తూరు జిల్లా సంప్రదించవలసిందిగా కోరుచున్నాము. మెడికల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, రెండు ఫోటోలు వెంట తీసుకుని వెళ్ళవలెను అని ఆంధ్ర ప్రదేశ్ దివ్యాంగుల మహా సంఘటన అధికార ప్రతినిధి నిమ్మకాయ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్లు నిమ్మకాయ సురేష్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల మహా సంఘటన రెండు వీధి అబ్బిరెడ్డి రామదాసు కాలనీ కరెంట్ ఆఫీస్ వద్ద నియర్ కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఫోన్ నెంబర్ 9177727623.

మోడరన్ హ్యూమానిటీ క్లబ్ చైర్మన్‌గా సత్తి సుబ్బారెడ్డి



విశాలాంధ్ర - రామచంద్రపురం : రామచంద్రపురం మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి రావు యూనివర్సల్ సింగిల్ ఫ్యామిలీ భావనతో త్వరలో ప్రారంభించనున్న మోడరన్ హ్యూమానిటీ క్లబ్ ఆవిష్కరణలో భాగంగా మంగళవారం రామచంద్రపురం మండలం తోటపేటకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సత్తి సుబ్బా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మోడరన్ హ్యూమానిటీ క్లబ్‌కి సంబంధించిన ప్రతిపాదనను సుబ్బారెడ్డికి జివి రావు వివరించారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా మరింత విస్తృతంగా ప్రణాళికబద్ధంగా ముందుకు అడుగులు వేస్తున్నట్లు జివి రావు పేర్కొన్నారు. "ఆకలి లేని సమాజం" మన వంతు ప్రయత్నం అనే ఆశయంతో తాను తలపెట్టిన ఈ కార్యక్రమానికి మోడరన్ శ్రేయోభిలాషుల నుండి విశేష స్పందన వస్తుందని ఈయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరికి రావు ధన్యవాదాలు తెలియజేశారు.

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక

విశాలాంధ్ర - రామచంద్రపురం : రామచంద్రపురం నియోజవర్గంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపిలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సత్యవాడ గ్రామ విద్యా కమిటీ మాజీ చైర్మన్ నాగబత్తుల సత్యనారాయణ (కొండ), గొట్టు రవికిరణ్, బెల్లపు అప్పారావు తో పాటు మరో 10 కుటుంబాలు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, సుభాష్ పరిపాలనా దక్షిత, చేసిన అభివృద్ధి, వ్యక్తిగతంగా పేదలను ఆదుకుంటున్న తీరు చూసి ఈపార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన 17మాసాల్లో అభివృద్ధి, సంక్షేమ సమపాళ్లలో చేపడుతున్నామన్నారు. అనతి కాలంలోనే నియోజవర్గాన్ని రూ.140 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. త్వరలో మరిన్ని నిధులు రానున్నాయని, సువర్ణ రామ చంద్రపురం నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని వెల్లడించారు. మొదట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సుభాష్ పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, ఉప సర్పంచ్ సలాది శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

నెలల నిండకుండానే పుట్టిన శిశువు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : నెలలు నిండగానే ఓ గర్భిణీ అంబులెన్స్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన తూరంగి సుహాసిని ఆరు నెలలు పూర్తి చేసుకున్న గర్భిణీ. నొప్పులు రావడంతో అంబులెన్స్ ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వస్తుండగా దారిలోనే ప్రసవం అయింది. నవజాత శిశువుకు ఉండాల్సిన స్పందనలేవి లేకపోవడంతో ప్రత్తిపాడు సిహెచ్సీలోని ఎస్ఎన్సీ యూలో చికిత్స చేశారు. శిశువు సాధారణ స్థితికి రావ డంతో పాటు తల్లి క్షేమంగా ఉంది. నెలలు నిండకుం డానే, 800 గ్రాముల బరువుతో జన్మించిన శిశువు క్షేమంగా ఉండటం విశేషమేనని ప్రత్తిపాడు సిహెచ్సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్ తెలిపారు.

మండల పాస్టర్స్ అధ్యక్షులుగా రెవ. జాన్‌పాల్

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండల పాస్టర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా రెవ. ఎ జాన్ పాల్ (చంటి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్, డా ఈ బ్లెస్సింగ్ ఆధ్వర్యంలో మండల పాస్టర్ అసోసి యేషన్ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం సామర్లకోట సూర్య ఫంక్షన్ హాలులో సోమవారం ఘనంగా జరి గింది. ఈ వేడుకలో ముఖ్య ప్రసంగికులుగా అంతర్జా తీయ వార్తమానికులు పాస్టర్ జఫన్య శాస్త్రి పాల్గొని క్రీస్తు జననానికి సంబంధించి పలు విషయాలను వివరించారు.

అనంతరం జరిగిన 2025-26 సంవత్సరానికిగాను నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షులుగా జాన్ పాల్, కార్యదర్శిగా డా పి ఆనంద్‌బాబు, కోశాధి కారిగా బిషప్ ఎం రాజేష్, ఉపాధ్యక్షులుగా రెవ. ఎ స్టీవెన్ కింగ్, సహాయ కార్యదర్శులుగా పాస్టర్ ఎ పీటర్, బిషప్ ఎ ఇమ్మానుయేల్ పాల్, పాస్టర్ ఆర్ సత్యం, సహాయ కోశాధికారిగా రెవ. డా పి ప్రభుదాస్, రెవ. డి అబ్రాహాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ నాయ కులు రెవ. జి జయబాబు, రెవ. పి తిమోతి, రెవ. వై కరుణ కుమార్, రెవ. డేవిడ్ రాజు, రెవ. పి విజయ బాబు, పాస్టర్ ఎస్ సైలాస్, పాస్టర్ వై రాము మోసెస్, డా ఎం సాల్మన్ రాజు, రెవ. ఎస్ బెంజిమెన్, రెవ. వి జాన్, అసోసియేషన్ సభ్యులు, వారి కుటుంబాలు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినాపురం గ్రామం, భాగవతుల చెరువు, డోర్ నెంబర్ 6-10 నివాసి **కుంచే చినదుర్గ, తండ్రి వీర వెంకట సత్యనారాయణ అను నేను** నా పాస్‌పోర్ట్ నెం: **P7900873** జిరాక్స్ తీసుకొనుటకు ఇంటి దగ్గర నుండి ముమ్మిడివరం సెంటరుకు వెళ్లినప్పుడు మార్గమధ్యలో జారి పడిపోయినది. దొరికిన వారు తెలియజేయగలరు.

కుంచే చినదుర్గ
తండ్రి: వీర వెంకట సత్యనారాయణ
అయినాపురం, ముమ్మిడివరం మండలం.

నేడు నల్లజర్లలో సీఎం పర్యటన

విశాలాంధ్ర - నల్లజర్ల : తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా విజయవంతంగా సాగేందుకు క్షేత్రస్థాయిలో స్వయంగా ఏర్పాట్లు పరిశీలిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు. రైతన్న మీకోసం కార్యక్రమం ముగింపు సభలో ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి మాట్లాడేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. ఇప్పటికే నల్లజర్ల, పోతవరం రోడ్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలం, సభాస్థలిని కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్,, ఆర్డీవో సుస్మితారాణి జిల్లా అధికారులు , ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, మండల టిడిపి అధ్యక్షుడు తాతిని సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ వెంకటరమణ, పి. రతీష్, ఎలమాటి సత్యనారాయణ, తదితర ఎన్డీఏ కూటమి నాయకులతో పర్యవేక్షించారు. సీఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలను అధికారులు చేపట్టారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటరాజు కోరారు

ముఖ్యమంత్రి పర్యటనకు ఏఎస్ఎల్ నిర్వహణ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిసెంబర్ 3న తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో, పర్యటన సజావుగా కొనసాగేల సభ వేదిక, హెలిప్యాడ్, తదితర ప్రాంతాలలో ఏ.ఎస్.ఎల్ (అడ్వాన్సుడ్ సెక్యూరిటీ లయిజన్) నిర్వహించి అధికారులు చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యల పై జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్ దిశా నిర్దేశం చేశారు. హెలిప్యాడ్, కాన్వాయ్, ప్రజా వేదిక వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగరాదని, కార్యక్రమ నిర్వహణలో లోటుపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.ఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి సుబ్బరాజు , అడిషనల్ ఎస్పీ (ఏ.ఆర్) ఎల్. చెంచిరెడ్డి, డి.ఎస్.పి.(ఎస్ బి) బి. రామకృష్ణ, జోనల్ డిఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

జీవీపీల తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

విశాలాంధ్ర - రాజమండ్రిసిటి : జీవీపీల (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల) తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరించారు. నగరపాలక సంస్థ పీజీ ఆర్ఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీపీల తొలగింపు, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం, ఐవీఆర్ఎస్ సర్వే సహ పలు అంశాలపై చర్చించారు. జీవీపీలను నూరు శాతం తొలగించాలని ఆదేశించి నెల రోజులైనప్పటికీ, కనీస పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రెండు రోజుల్లో జీవీపీలను తొలగించాలని ఆదేశించారు. అవసరమైతే ఆర్ ఆర్ ఆర్ (రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్) సెంటర్ సాయంతో ఆయా ప్రదేశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే షాపుల నిర్వాహకులు, వీధి వ్యాపారులు తప్పనిసరిగా డస్ట్ బిన్ లు ఉపయోగించేలా చూడాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. ఉదయం 6.00 గంటల కల్లా సిబ్బంది ఫీల్డ్ లో ఉండాలని కమిషనర్ ఆదేశించారు. రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, ఊడ్చిన చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలన్నారు. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ను తప్పనిసరిగా పాటించాల న్నారు. నగరంలో గుర్తించిన ఫీడింగ్ పాయింట్లను శానిటరీ సూపర్ వైజర్లు పరిశీలించి రెండు రోజుల్లో ఫైనలైజ్ చేయాలన్నారు. వీటితో పాటు పబ్లిక్ గ్రీవెన్స్ ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడంతో పాటు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పుష్కరాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించండి

- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నిలిచిన రోడ్డు పనులు
- కోరుకొండ భూముల సమస్య పరిష్కారం
- నియోజకవర్గ సమస్యలు పై "బాబుతో బత్తుల"

విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం, కోరుకొండ : పరమపవిత్రమైన గోదావరి నదికి 2027లో జరగనున్న పుష్కరాలకు తమ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ కోరారు. రాజానగరం నియోజకవర్గ సమస్యలను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టిలో పెట్టేందుకు మంగళవారం అమరావతి తరలివెళ్లిన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ తొలుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నియోజకవర్గం పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించి వినతి పత్రాలు అందజేశారు. దీనిలో భాగంగా పుష్కరాలలో రాజానగరం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఇందుకోసం లైన్ డిపార్టుమెంటుతో సమీక్షించి రూ:648 కోట్లతో ప్రతిపాదనలు సీఎం చంద్రబాబుకి అందజేశారు.వీటిలో సీతానగరం మండలంలో గోదావరి నది వెంబడి 23.5 కి.మీ. విస్తీర్ణంలో గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసామని ఆర్ అండ్ బి శాఖ ద్వారా కీలకమైన రోడ్లకు సంబంధించి 35 పనులకు రూ. 277 కోట్లు, పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంటు ద్వారా 60 పనులకు రూ: 81 కోట్లు, ఆర్ డబ్ల్యు ఎస్ డిపార్టుమెంటు శాఖ ద్వారా 1535 పనులకు రూ.129 కోట్లు, 18 ఘాట్లలో యాత్రికుల సదుపాయాల కోసం రూ.4.89 కోట్లు, మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అయిన లాలాచెరువులో 65 పనులకు రూ.33.56 కోట్లు, నీటి వనరుల శాఖ ద్వారా 14 ఘాట్ల అభివృద్ధి కోసం రూ.121.57 కోట్లు మొత్తంగా రూ. 648 కోట్ల అంచనా వ్యయంతో నివేదిక సమర్పించారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా పలు రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి అని వివరించారు. రోడ్ల కాంట్రాక్టర్ల పనితీరును సమీక్షించి సంబంధిత అధికారులను ఆదేశించాలని, డిఫాల్ట్ ఏజెన్సీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కీలకమైన రోడ్డు పనులు త్వరగా పూర్తీ అయ్యేలాగా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పురుషోత్తపట్నం పుష్కర ఎత్తిపోతల పథకం రైతులకు నష్టపరిహారం కోసం సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, చినకొండేపూడి, నాగంపల్లి గ్రామాల రైతులు భూములు ఇచ్చారని వారిలో 92 మంది రైతులకు న్యాయమైన పరిహారం మాత్రం అందలేదని వారు ఆందోళన చెందుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు.అలాగే కోరుకొండ భూముల సమస్య పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని,రైతులకు న్యాయం చేయాలనీ బత్తుల కోరారు.గత ప్రభుత్వంలో ఈ విషయం నిర్లక్ష్యానికి గురైందని వివరించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధులు ధరఖాస్తులు కొన్ని తిరస్కరణకు గురయ్యాయని సదరు లబ్ధిదారులు చాలా పేదవారని వారికి మానవతా దృక్పదంతో ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు విన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో అకడమిక్ ఇన్స్ట్రక్టర్‌గా దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర - పెదపూడి : శహపురం గ్రామంలో ఎంపీపీఎస్(నంబర్-1) పాఠశాల్లో అకడమిక్ ఇనస్ట్రక్టర్గా పనిచేయడానికి అర్హత గల అభ్యర్ధుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీఓ-1 జి విశ్వనాథం తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఈ ఉద్యోగం ఐదు నెలలు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయాలన్నారు. నెలకు రూ.10వేలు జీతం ఇస్తారన్నారు. ఇంటర్మీడియట్, డీఎడ్ చదువు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 5వ తేదీలోపు పెదపూడి మండల విద్యాశాఖకార్యాలయంలో దరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు.

అసోసియేషన్ పదవులకు రవి కుమార్ రాజీనామా

విశాలాంధ్ర - కడియం : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఎంప్లాయిస్ మరియు ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవులకు రాజీనామా చేసినట్లు పి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడుగా కూడా రాజీనామా చేసినట్లు తెలిపారు. ఆయా సంఘాలలో సభ్యుడిగా కూడా వైదొలగుతున్నట్లు తెలిపారు. అసోసియేషన్ల లోని అధిష్టానం, సభ్యుల కోరిక మేరకు ఇప్పటివరకు పదవులలో కొనసాగానని, అనివార్య కారణాలవల్ల ఈ పదవుల నుండి వైదొలుగుతున్నట్లు ఆయన తెలిపారు. సంఘాల అధ్యక్షులకు వాట్సప్ ద్వారా, రాజీనామా లేఖలు పంపినట్లు తెలిపారు.

నగర అభివృద్ధికి ఐకమత్యంతో ముందుకు సాగుదాం : మేయర్ నూర్జహాన్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : నగరాభివృద్ధికి పాలకవర్గం ఐకమత్యంతో ముందుకు సాగితే ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు తీసుకు వచ్చి ఏలూరును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు స్పష్టం చేశారు. అదేవిధంగా నగరంలో విలీనమైన చొదిమెళ్ళ గ్రామ పంచాయతీని 27 డివిజన్ పరిధిలో కలపగా భౌగోళికంగా దొండపాడు కాలనీ ప్రాంతం మాత్రం దెందులూరు నియోజకవర్గ పరిధిలో ఉంది. దీంతో దొండపాడు ప్రాంతంలో పరిపాలనకు ఆటంకం ఏర్పడుతున్న దృష్ట్యా దొండపాడు ప్రాంతాన్ని కార్పొరేషన్ నుండి మినహాయించి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసుకునేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మంగళవారం ఏలూరులోని సంస్థ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి మేయర్ అధ్యక్షత వహించారు. అజెండాలో పొందుపరిచిన 18 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. వాస్తవానికి కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే అధికార ప్రతిపక్ష, కార్పొరేటర్లు వాదోపవాదాలతో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఆగ్రహ వేశాలతో బిగ్గరగా కేకలు వేసుకుంటూ కౌన్సిల్ వాతావరణం వేడెక్కిస్తారు. అయితే మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. సమావేశం ప్రారంభమైన దగ్గర నుండి కౌన్సిల్లో ప్రతిపక్ష అధికార పక్ష కార్పొరేటర్ల మధ్య ఎటువంటి వాదోపవాదాలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో కౌన్సిల్ సమావేశం ముగియడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పరస్పర సమన్వయంతో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించుకుని నగరాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ సమావేశంలో ప్రతిపాదించిన 18 అజెండా అంశాలలో మున్సిపల్ కార్మికుల వేతనాలకు సంబంధించి భద్రత కల్పించేవి కూడా ఉన్నాయన్నారు. షెడ్యూల్ కులాల నివాసిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.1 కోటి రూపాయలు నిధులు కేటాయించారన్నారు. నిబంధనల లోబడి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుని ఎన్నుకోన్నామన్నారు. నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ రుసుము ప్రస్తుత ధరలపై 33% పెంపు విషయమై కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు పంచాయతీలకు సంబంధించి విలీనానికి ముందే పెండింగ్లో ఉన్న రూ.22 కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల బకాయిలపై అపరాధ రుసుముతో కలిపి రూ.34 కోట్ల రూపాయలకు చేరిందని వివరించారు. అందువల్ల ఈ బకాయిలు చెల్లించే పరిస్తితి కార్పొరేషన్ కు లేనందున ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించిందన్నారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్ సహకారంతో పాలకవర్గం చేసిన కృషి ఫలితంగా కార్పొరేషన్ కు రూ.453 కోట్ల రూపాయల నిధుల విడుదల కాగా నగరంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు.

సిస్టం పనులు త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఎన్.క్యాప్ నిధులు 6 కోట్ల 57 లక్షలతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచనలకు అనుగుణంగా కాలుష్యాన్ని నివారించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిప్యూటీ మేయర్ పప్పు ఉమా మహేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం మాట్లాడుతూ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య సహకారంతో సీఎం నారా చంద్రబాబు నాయుడుతో ఉన్న అనుబంధంతో నగర అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తున్నారన్నారు. ప్రజాసేవకై అంకితం అవుతూ అన్ని వర్గాల ప్రజల అవసరాలను తీరుస్తున్నారన్నారు. ఈ సమావేశం లో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్, అదనపు కమిషనర్ డి. శ్రీనివాస్, ఎంఈ సురేంద్రబాబు, మేనేజర్

ఘనంగా వరల్డ్ ఎయిడ్స్‌డే

విశాలాంధ్ర - గణపవరం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పి.ఎం.పి అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లా కలసి గణపవరం మండల అధ్యక్షులు మందా సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సరిపల్లె మీనాక్షి క్లినిక్ నుండి అవగాహన ర్యాలీజరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర గౌరవ సలహాదారులు నిడమర్తి ఎన్ జయ సూర్య, జిల్లా అధ్యక్షులు ఏ ఆర్ కె పరమేశ్వర్లు మాట్లాడుతూ హెచ్ఐవి ఒక వైరస్. ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను బలహీన పరుస్తుంది చికిత్స చేయకుండా వదిలేస్తే ఇది ఎయిడ్స్ గా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి శివ శ్రీనివాసరావు, కోటకల అప్పారావు, మస్తాన్ వలి పానకాల రావు, సత్యనారాయణ, జి మూర్తి, సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

విశాలాంధ్ర-కాళ్ళ : విద్యార్థి దశ నుండే విద్యార్థులు పుస్తకాలతో పాటు సమాజాన్ని, తమ ఇంటిని, తమ పరిసరాలను, తమ తోటి వారి స్థితిగతులను అధ్యయనం చేయాలని జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు. సిహెచ్. పట్టాభిరామయ్య పిలుపునిచ్చారు. తమ స్వగ్రామానికి సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాలవానితిప్ప నందు ఆయన సౌజన్యంతో యుటిఎఫ్ ముద్రించిన పదవ తరగతి మోడల్ ప్రశ్న పత్రాల పుస్తకాలను అందించిన సందర్భంగా పాల నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. శ్రీ పట్టాభిరామయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఈరకమైన అధ్యయనం మన జీవిత గమనాన్ని నిర్దేశిస్తుందని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో చదువుకోవడం అంటే చాలా కష్టంగా ఉండేదని, సుదూర ప్రాంతమైన భీమవరం వంటి చోట్లకు నడిచివెళ్లి లేదా, ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుకునే వారమని ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు ఉపయోగించు కుని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణం రాజు, సి.హెచ్.కుమారబాబ్జి, యూటీఎఫ్ కాళ్ళ మండల అసోసియేట్ అధ్యక్షులు డి.కనకదుర్గ, ఉపాధ్యాయులు ఎన్.డి.వి.ప్రసాద్, పి .అప్పలస్వామి, శివలాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించాలి

విశాలాంధ్ర-పెదపాడు: జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం మంగళవారం వట్లూరులోని గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ కోమలి మాట్లాడుతూ పిల్లల్లో ఎదురయ్యే మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులలో పరీక్షలు వల్ల ఎదురయ్యే ఆందోళన భయము, ఒత్తిడి వంటి సమస్యలు ఎలా ఎదుర్కోవాలి అనే వాటి పై అవగాహన కల్పించారు. 14416 టెలిమానస్ హెల్ప్లైన్ గురించి సమాచారం ఇచ్చారు. విద్యార్థులకు ఒత్తిడి సమయం లో చేయవలసిన రిలాక్సేషన్ టెక్నిక్స్ , మెడిటేషన్ వంటి సూచనలు సలహాలు అందించారు. అనంతరం విద్యార్థినిలతో ముఖాముఖిగా వారి మానసిక సమస్యలకు కౌన్సిలింగ్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి మేరీ ఝాన్సీ మాట్లాడుతూ పిల్లలు శారీరిక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంత అవసరమో వివరించారు. ఈ కార్యక్రమం లో సోషల్ వర్కర్ తిరుపతి స్వామి, వట్లూరు పీహెచ్ ఏఎన్ఎం సుబ్రహ్మణ్యేశ్వరి, ఆశ వర్కర్ నాగ లక్ష్మి,ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై ప్రత్యేక శిక్షణ

విశాలాంధ్ర -ఏలూరు : పల్స్ పోలియో కార్యక్రమంపై ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మెడికల్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జె. అమృతం తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జె. అమృతం ఈ నెల 21 వ తేదీన జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమం గురించి వివరించారు పోలియో చుక్కల పంపిణీ, బూత్ వ్యవస్థ, ఇంటింటి సర్వే, కోల్డ్ చెయిన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, హౌస్ టూ హౌస్ మార్కింగ్, లాజిస్టిక్స్, రిస్క్ ఏరియా ప్లానింగ్, ఫీల్డ్ సందర్శనల పై మెడికల్ ఆఫీసర్లకు పి.పి.టి. ద్వారా వివరించారు.జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డా.శోభ మాట్లాడుతూ 'టీకా భద్రపరిచే విధానం బృందాల సమన్వయం పై మెడికల్ ఆఫీసర్లకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, టి.బి. అధికారి డా.లక్ష్మీనారాయణ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో పదేళ్ల వయస్సు ఉన్న ఓ మైనర్ బాలిక కనిపించకపోవడంతో సీతానగరం పోలీసు స్టేషన్‌ను బాలిక తల్లిదండ్రులు ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.రామ్ కుమార్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నుంచి మైనర్ బాలిక కనిపించడం లేదన్నారు. బాలికకు మాటలు సరిగారావని స్పష్టం చేశారు.బాలిక వివరాలు సరిగా చెప్పలేదని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు వెంటనే 9440904832, 9440904829 పై ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

వైసీపీ నేత కుంచే రమణారావు

విశాలాంధ్ర - అమలాపురం : విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగు తాయని, విద్యకు పేదరికం అడ్డుకారాదని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరులో పేద కుటుంబానికి చెందిన కొడమంచిలి వెంకటేశ్వరరావు కుమార్తె కృపావతి బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నది. నాలుగు సంవత్సరాల బిటెక్ కోర్సు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న రమణారావు కృపావతి చదువు కొనసాగించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం కృపావతి చదువు కొనసాగించేందుకు రమణారావు రూ.25 వేలు చెక్కును కృపావతికి అందజేసి భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందజేసే చదువును ప్రోత్సహిస్తున్న రమణారావుకు ఈ సందర్భంగా కృపావతి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పినిపే జయరాజ్, నేరేడుమిల్లి శ్రీను, నక్కా సంపత్ కుమార్, పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీప్రసాద్, వినోద్, జోసెఫ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు, రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - గోకవరం : విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు చేపట్టిన ప్రజా సేవ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ కార్యక్రమం ఒకటి. సుమారుగా రెండేళ్ల నుంచి గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గర్భిణీలు, అక్కడికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతి మంగళవారం పండ్లు, పాలు, రొట్టెలను కంబాల శ్రీనివాసరావు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ మంగళవారం కూడా యథావిధిగా రామసేన సిబ్బంది గర్భిణీలు, రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను అంద జేశారు. తనసేవా కార్యక్రమాలు నిరంత రాయంగా కొనసాగుతూనే ఉంటాయని, తన వద్దకు కష్టం అని వచ్చిన వారికి, లేదు అనకుండా సహాయం చేసి తిరిగి పంపిస్తున్నానని, కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సిబ్బంది వీరబాబు, బాబీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన గఫర్ ఖాన్

విశాలాంధ్ర - నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఏలూరు జిల్లా తెలుగు యువత కార్యదర్శి మొహమ్మద్ గఫర్ ఖాన్ హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. టీడీపీ అభివృద్ధి గురించి మండల సమస్యలు గురించి చంద్రబాబు నాయుడు అడిగి తెలుసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.కూటమి ప్రభుత్వంలో అందరూ కలసి పనిచేయాలని చెప్పారని అన్నారు.



సీఎం చంద్రబాబుకు యాళ్ళ స్వాగతం

విశాలాంధ్ర - గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గం పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గణప వరం మండలం అప్పన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లవు రాజుపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. టీడీపీ అభివృద్ధికి కృషి చేసినందుకు సుబ్బారావును చంద్రబాబు నాయుడు అభినందించి నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోండి

విశాలాంధ్ర-దెందులూరు: వాతావరణంలో మార్పులు వల్ల రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా వరి పంటను కోసి దాన్యం రాశులుగా ఉన్న రైతులు తప్పనిసరిగా తుఫాను వల్ల వర్షంలో ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవసరమైతే ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రాలలో వరి ధాన్యాన్ని నిలవ చేసుకోవాలని దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్. శ్రీనివాస్ రాజు తెలిపారు. మంగళవారం దెందులూరు మండలంలోని పోతునూరు కావలి దోసపాడు గ్రామాల్లో రోడ్ల మీద పొలం గట్ల మీద ఉన్న వరి ధాన్యం రాశుల వద్దకు చేరుకుని రైతులకు వాతావరణంలో తేడాలను నేపథ్యంలో వరి ధాన్యం తడవకుండా రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంచుకోవాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణి

విశాలాంధ్ర - ఉంగుటూరు : స్టడీ మెటీరియల్ ద్వారా పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉంగుటూరు నారాయణపురం హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ఉమ్మడి పశ్చిమగోదావరి, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు వారు సంయుక్తంగా తయారుచేసిన స్టడీ మెటీరియల్ విజయ్ కేతనం బుక్స్ ను 10వ తరగతి విద్యార్థులకు సర్పంచి అందజేశారు. హెచ్ఎం తోట పోతురాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామికి రూ.కోటికి పైగా ఆదాయం

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రముఖ పుణ్యక్షేత్రం సామర్లకోట బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామికి కార్తీక మాసం నెలరోజులతో కలిపి 53 రోజుల్లో రూ.1 కోటి ఐదు లక్షల 75 వేల 51 రూపాయి ఆదాయంగా వచ్చింది. దేవాదాయ శాఖ తనిఖీదారు వడ్డీ ఫణి కుమార్, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం భీమేశ్వర స్వామి ఆలయంలో హుండీలు లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించగా హుండీల ద్వారా 22 లక్షల 37 వేల, 942 రూపాయలు ఆదాయం రాగా దర్శనముల ద్వారా 36 లక్షల ఇరవై తొమ్మిది వేల 398 రూపాయలు కానుకుల ద్వారా 38 వేల 15 రూపాయలు ప్రసాదములు అమ్మకం ద్వారా 12 లక్షల 86 వేల 85 రూపాయలు అర్జిత సేవలు ద్వారా మూడు లక్షల 20 వేల రూపాయలు స్వామి వారి ఫోటోలు అమ్మకం ద్వారా 11,540 రూపాయలు ఆన్లైన్ విరాళాల ద్వారా 7, లక్షల94, వేల 876 రూపాయలు అన్న దానం విరాళాల ద్వారా 22 లక్షల ఇరవై తొమ్మిది వేల 398 రూపాయలు కలిపి సుమారు కోటి ఐదు లక్షల 75 వేల 51 రూపాయిలు ఆదాయం సమకూరింది. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తల మండల సభ్యులు చీమల కొండ వీరభద్ర ప్రసాదరావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గొల్తి సత్యనారాయణ, అలోక్ చంద్ర జైన్, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భాను వెంకట పద్మ, గోనిపాటి బుల్లెమ్మ, హరిహర సేవా సంఘం సభ్యులు, ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు, శ్రీరామ సేవా సంఘం సభ్యులు, రెవిన్యూ సిబ్బంది, అర్చకులు, పుర ప్రజలు తదితరులు ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు కుటుంబం

విశాలాంధ్ర - జగ్గంపేట : తిరుమల శ్రీవారినిరాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, కోటనందూరు మండలం యూత్ కమిటీల పరిశీలకులు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. వీఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ టీటీడీ బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు ఆధ్వర్యంలో మన ప్రియతమ నాయకులు జ్యోతుల నెహ్రూ బోర్డు సభ్యులుగా తిరుమలలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారని ముఖ్యంగా వైకుంఠం నుండి భక్తులకు దర్శనం కల్పించడం, నాణ్యమైన నిత్యవసర వస్తువులతో అన్నదానం, ప్రసాదం తయారీ వంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఆ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు జగ్గంపేట నియోజకవర్గ ప్రజలందరి పైన ఉండాలని కోరుకున్నానని అన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన గట్టి సత్యనారాయణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను బిజెపి రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులు ఇంజనీర్ గట్టి సత్యనారాయణ సందర్శించారు. మంగళ వారం కళాశాలకు విచ్చేసిన ఆయనకు ప్రిన్సిపాల్ కే సుజాత సహ ఇతర అధ్యాపక బృందం ఘనంగా స్వాగతం పలికి శ్రీకృష్ణుని ప్రతిమను బహూకరించారు. సివిల్, ఫార్మసీ విభాగాల విద్యార్థులకు అవ సరమైన బోధనా పరికరాలు, యుపిఎస్‌ల కొరత ఉన్న విషయం ఇప్పటికే కళాశాల అధ్యాపకులు సత్యనారాయణ దృష్టి తీసుకురావడంతో ఆయన వాటిని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. సుమారు రు.35 వేల రూపాయిల విలువైన పరికరాలను కొనుగోలు చేస్తే ఆ సొమ్మును అందిస్తానని వెల్లడించారు. తన సతీమణి పుప్పాల రాంజీ కళాశాల పూర్వ విద్యార్థిని కావడంతో ఆమె చేతుల మీదుగా ఈ సహకారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఆర్ఎస్ఎస్ శత వసంతాల ప్రాంతీయ సమ్మేళనాలలో ప్రజలు భాగస్వా ములు కావాలని సత్యనారాయణ ఆహ్వానించారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : పేద ప్రజలను తక్షణంగా ఆదు కునే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర వైద్య సహా యాన్ని అందజేస్తున్నట్లు రూరల్ శాసనసభ్యులు తెలిపారు. ఈ రోజు గోరంట్ల కార్యాలయంలో అత్యవసర వైద్య చికిత్స అవసర మైన మొత్తం 5 మంది లబ్ధిదా రులకు రూ. 9,33,066 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కొంత మూరు గ్రామానికి చెందిన సయ్యద్ బబీరమ్మ (బేబీ)కు రూ. 2,00,000, మాధవరాయుడు పాలెం గ్రామానికి చెందిన లావేటి ఐల కు రూ. 2,00,000, కాతేరు గ్రామా నికి చెందిన కూచిపూడి శారదకు రూ. 3,21,700, హుకుంపేట గ్రామానికి చెందిన బండి శ్రీలక్ష్మికు రూ. 1,86,200, పొట్టిలంక గ్రామానికి చెందిన పట్టపగలు విజయకుమార్కు రూ. 25,166. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు అవసరమయ్యే వారికి ఎల్.ఓ.సి రూపంలో తక్షణ సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వైద్య ఖర్చు లు ముందుగానే భరించి చికిత్స పొందిన వారికి రీయింబర్స్‌మెంట్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధి అందజేస్తున్నట్లు తెలిపారు. పేదల ఆరోగ్య రక్షణ కోసం కోట్లాది రూపాయలను అభివృద్ధి చర్యలలో భాగంగా కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, నున్న కృష్ణ, షేక్ ఖాసిం, కలిదిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెఆర్ ఉమెన్స్ హాస్టల్‌లో మరమ్మతులు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : హితకారిణి సమాజంలో ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ఉమెన్స్ హాస్టల్ లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటీ పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని హితకారిణి సమాజం చైర్మన్ డా. యాళ్ళ ప్రదీప్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ఉమెన్స్ హాస్టల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యలక్ష్మి మహిళా వసతి గృహంలో మరుగుదొడ్లు అధ్వన్నంగా ఉన్నాయని, దాంతో అక్కడి విద్యార్థినులతో సమావేశం నిర్వహించి ప్రతి కాంప్లెక్సులో ఉన్న పది మరుగు దొడ్లను మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ఇలా ప్రతి కాంప్లెక్సులో ఉన్న మరుగుదొడ్లను మరమ్మతుల కోసం ఏడు లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు ఆయన చెప్పారు. తాము అధి కారంలోకి వచ్చిన వెంటనే హితకారిణి సమాజం అభివృద్ధికి పాటుపడుతున్నా మన్నారు. హితకారిణి సమాజానికి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు తమ సాయ శక్తుల కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాజమండ్రి ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మెన్ చల్లా శంకర రావు మాట్లాడుతూ, హితకారిణి సమాజాన్ని గత పాలకవర్గాలు ఎంతో తీర్చిదిద్దాయని కానీ, గత వైసిపి వేసిన పాలకమండలి సంస్థను నాశనం చేసిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజమండ్రితో సంబంధం లేని వ్యక్తి హితకారిణి సమాజం చైర్మెన్ ని చేశారని, ఇది నాటి పాలనకు నిదర్శనమని, కందుకూరి ఆశయాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, ఆదిరెడ్డి వీరవెంకట సత్యనారాయణలు పాల్గొన్నారు.

అన్ని సమస్యలకు పరిష్కార గ్రంథం భగవద్గీత

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : అన్ని సమస్యలకు పరిష్కారం చూపే గ్రంథం భగవద్గీత అని ప్రముఖ జ్యోతి ష్య సంస్కృతాంధ్ర పండితుడు ప్రభల సుబ్ర హ్మణ్య శర్మ అన్నారు. గీతా జయంతి సందర్భంగా స్థానిక శ్రీరామ నగర్ శ్రీ దువ్వూరి రామకృ ష్ణారావు ట్రస్ట్ సభా మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభల మాట్లా డుతూ ప్రపంచంలో మానవాళి సమస్యల పరిష్కారానికి భగవద్గీతను మించిన గ్రంథం లేదన్నారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీత బోధిం చినప్పటికీ ఇది సామాన్య మానవులను దృష్టిలో ఉంచుకుని చెప్పిం దన్నారు. అనంతరం ప్రభలను ట్రస్ట్ అధ్యక్షుడు ప్రభాకరశర్మ సత్కరించా రు. కార్యక్రమంలో చాగంటి నరసిం హరావు, సత్యమూర్తి, ఎం. రామ కృష్ణా, రావు, నల్లగొండ రవిప్రకాష్, సావిత్రి దంపతు లు, దినవహి నాగసాయి పాల్గొన్నారు. అలాగే, స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి పర్యవేక్షణ లో జరిగిన కార్యక్రమంలో సంస్కృత విభాగాధ్య క్షురాలు ప్రభల శ్రీవల్లి మాట్లాడుతూ భగవద్గీతను చదవడమేగాక దానిని జీవితంలో అన్వ యించుకుంటే రోజువారీగా మనకు ఎదురయ్యే అనేక సవాళ్లను సుల భంగా అధిగమించగలమన్నారు. గీతా పారాయణం అనంతరం విద్యార్థినులకు గీతాపారాయణం పుస్తకాలను ఉచితం గా పంపిణీ చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

- రైతుల యూరియా పై రగడ
- వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- వాడివేడిగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - రాజానగరం : మండలాధికారుల సమన్వ యంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నా మని ఎంపీపీ మందారపు సీతారత్నం వీర్రాజు అన్నారు. మండల కేంద్రమైన రాజానగరం లోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోనీ మండల ప్రజా పరిషత్ సమావేశ కార్యాలయం నందు ఎంపిడివో జె. ఏ.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో, ఎంపీపీ మందారపు సీతారత్నం వీర్రాజు అధ్యక్షతన మంగళ వారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. మండలం లోని తోకాద, మల్లంపూడి, పుణ్యక్షేత్రం, రామస్వామి పేట గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ సమస్యలు లేవనెత్తారు. దీనిలో భాగంగా పుణ్యక్షేత్రం గ్రామ పరిధిలో రైతులకు సక్రమంగా యూరియా అందడంలేదని,పంట నష్టపరిహారం రాలేదని ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి కళ్యాణ్ సూర్య కుమార్ మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో ఇంకా వరి పంట కొనుగోలు చెయ్య వలసి ఉందని,ప్రతి చివరి గింజ కొనుగోలు చేస్తా మని చెప్పారు. పంట నష్ట పరిహారం అందరికీ అందుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రతి ఒక్క రైతుకి భూమికి సరిపడ యూరియా మాత్రమే అందజేసామ న్నారు.అలాగే రామస్వామిపేట, రాధేయపాలెం గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చెయ్యాలని,కాలం గడుస్తునప్పటికీ

ఎక్కడి గొంగళి అక్కడే ఉన్నట్లు విద్య భవనాలు ఉన్నాయని విమర్శించారు.వీటిపై విద్య శాఖాధికారులు మాట్లాడుతూ దాదాపు 70 శాతం భవన నిర్మాణం పూర్తి అయ్యాయని,త్వరలో నూరు శాతం పూర్తి చేసి నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తా మని చెప్పారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాజానగరం ప్రాధానిక వైద్య ఆరోగ్య కేంద్రం(పి. హెచ్.సి) నందు వివిధ శస్త్రచికిత్సలు, గర్భిణి స్త్రీలుకి సులభ ప్రసవాలు చేస్తున్నామని రాజానగరం పి. హెచ్.సి ప్రధాన వైద్యులు డాక్టర్ రామ్ భాస్కర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అనంతరం డిశ్చార్జి సమయంలో తల్లి బిడ్డకు ప్రభుత్వం అందించే ప్రయోజనాలు,నగదు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆసుపత్రిలో వైద్య సేవలు కోసం కొంతమందిలో అభద్రత భావం ఉందని,వాటిని ప్రజలు విడనాడాలని కోరారు. తమ పి.హెచ్.సి నందు కుక్క కాటుకు ఇచ్చే వ్యాక్సిన్, పాము కాటు వ్యాక్సిన్,అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రి పై చులకన భావాన్ని విడనాడి ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మందారపు సీతారత్నం వీర్రాజు,వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ టి.వెంకట రమణమ్మ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గంగిశెట్టి చంటి బాబు,యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, కార్మిక సంక్షేమ శాఖ డైరెక్టర్ నీలపాల అరవ రాజు, ఎంపీడీవో ఝాన్సీరాణి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు వివరించారు.ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిర్వహించిన సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ పై ప్రజలకు వివరించాలని అంశాలు ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ నెలలో మంజూరైన 19 నూతన సామాజిక పెన్షన్ల వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో సీడీపీవో జి.గౌరీ, వ్యవసాయ శాఖాధికారి కళ్యాణ్ సూర్య కుమార్, ఎంఈవోలు రామన్న దొర,గుబ్బల జ్యోతి ప్రసాద్, ఏపీవో ఉప్పలపాటి భ్రమరాంబ, ఏపీఎం జి.సునీత,వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు,సర్పంచులు పాల్గొన్నారు.